


ఫైళ్ల క్లియరెన్స్‌లో జెట్ స్పీడ్



- కలెక్టర్ వద్ద ఆరు నెలల్లో 7003 ఫైళ్లు చకచకా..
- వాయువేగ స్పందనతో సుమిత్‌కుమార్ టాప్
- అదే తరహాలో జేసీ విద్యాధరి

రాష్ట్రంలోని మిగిలిన జిల్లాలతో పోల్చుకుంటే చిత్తూరు కలెక్టర్ సుమిత్‌కుమార్ వడివడిగా ఫైళ్లను క్లియర్ చేస్తున్నారు. వాస్తవానికి ఆయన వద్దకు ఎక్కువ సంఖ్యలో ఫైల్స్ వస్తున్నాయి. ఆరు నెలల్లో ఏకంగా 7,150 ఫైల్స్ వచ్చాయి. రాష్ట్రంలోనే ఇది ప్రథమ స్థానం. జేసీ విద్యాధరి వద్దకూ 4,120 వచ్చాయి. ఇది రాష్ట్రంలో ఐదో స్థానం. వీరి వద్దకు వస్తున్న ఫైల్స్ సగటున ఒకట్రెండు రోజుల్లోనే క్లియర్ చేస్తున్నారు. ఈ మేరకు ఫైల్స్ క్లియరెన్సులో మంత్రులు, సెక్రటరీలు (ఐఏఎస్), సెక్రటరియేట్ డిపార్ట్‌మెంట్ వారీగా, హెచ్‌వోడీస్‌లతో పాటు కలెక్టర్, జేసీలు ఏ స్థానంలో ఉన్నారో ప్రభుత్వం బుధవారం ప్రకటించింది.

- చిత్తూరు, ఆంధ్రజ్యోతి

● కలెక్టర్ వద్ద 30 గంటలు.. : కలెక్టర్ సుమిత్‌కుమార్ వద్దకు జూలై 15 నుంచి డిసెంబరు 9 వరకు అన్ని శాఖలకు చెందిన 7,150 ఫైల్స్ వచ్చాయి. అందులో 7,003 ఆయన క్లియర్ చేశారు. ఇందుకు సగటున 31 గంటలు పట్టింది. అలాగే సెప్టెంబరు 9 నుంచి డిసెంబరు 9 వరకు 1,555 ఫైల్స్ వస్తే, ఇందులో 1,421 క్లియర్ చేసేశారు. దీనికి సగటున 30 గంటల సమయం పట్టింది. రాష్ట్రంలోని మిగతా జిల్లాలతో ఫైల్స్ భారం అధికంగా ఉంది. ఆరు నెలల కాలానికి.. టాప్ 3 జిల్లాలు చూసుకుంటే చిత్తూరు కలెక్టర్‌కు 7,150, నంద్యాల కలెక్టర్‌కు 5,906, శ్రీకాకుళం కలెక్టర్‌కు 4,776 ఫైల్స్ వచ్చాయి. మన్యం కలెక్టర్‌కు 109, పల్నాడు కలెక్టర్‌కు 110, కాకినాడ కలెక్టర్‌కు 146 ఫైల్స్ వచ్చాయి. ఫైల్స్ తాకిడి విషయంలో ఈ మూడు జిల్లాలు కింది మూడు స్థానాల్లో ఉన్నాయి.

● జేసీ వద్ద 3.5 రోజులు..

జేసీ విద్యాధరి వద్దకు జూలై 15 నుంచి డిసెంబరు 9 వరకు 4,120 ఫైల్స్ వచ్చాయి. ఇందులో 4,092 క్లియర్ అయ్యాయి. సగటున 3.5 రోజుల సమయం పట్టింది. ఫైల్స్ సంఖ్య, క్లియర్ విషయంలో జేసీ 5వ స్థానంలో ఉన్నారు. సెప్టెంబరు 9 నుంచి డిసెంబరు 9 వరకు 318 ఫైల్స్ వస్తే.. అవన్నీ క్లియర్ చేశారు. ఇందుకు సగటున 43 గంటల సమయం పట్టింది.



వేమూ ఇంజనీరింగ్ కళాశాలలో అభ్యర్థులను తనిఖీ చేస్తున్న సిబ్బంది

టెట్‌కు 78 మంది గైర్హాజరు

చిత్తూరు సెంట్రల్, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): జిల్లాలో తొలి రోజైన బుధవారం టెట్ పరీక్షలు ప్రశాంత వాతావరణంలో జరిగాయి. ఐదు కేంద్రాల్లో 800 మంది అభ్యర్థులకు గాను 722 మంది హాజరు కాగా, 78 మంది గైర్హాజరయ్యారు. ఉదయం సెషన్‌లో 540 మందికి 486 మంది హాజరుకాగా, 54 మంది గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం సెషన్‌లో 260 మందికి గాను 236 మంది హాజరుకాగా 24 మంది గైర్హాజరయ్యారు. అభ్యర్థులను క్షుణ్ణంగా పరిశీలించి లోనికి అనుమతించారు. కట్టుదిట్టమైన పోలీసు భద్రత నడుమ పరీక్షలు నిర్వహించారు.

నేడు నింద్ర ఎంపీపీ ఎన్నిక

నింద్ర, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): నింద్ర మండల పరిషత్ అధ్యక్ష ఎన్నిక గురువారం నిర్వహించనున్నారు. ఉదయం 10 గంటలకు ప్రక్రియ ప్రారంభమవుతుందని ఎంపీడీవో శివప్రసాద్‌వర్మ తెలిపారు. ఎంపీపీ పదవికి దీప రాజీనామా చేయడంతో ఇంతకాలం ఇన్‌చార్జి ఎంపీపీగా దుర్గాదేవి వ్యవహరించారు. ఇప్పుడు ఆ స్థానానికి ఎన్నిక నిర్వహిస్తున్నారు. ఎంపీడీవో కార్యాలయం, పరిసర ప్రాంతాల్లో 144 సెక్షన్ అమల్లో ఉంటుందని, ఒకరికంటే ఎక్కువ మంది గుమికూడితే చర్యలు తీసుకుంటామని నగరి రూరల్ సీఐ భాస్కర్ తెలిపారు.

పుంగనూరు సింగిల్‌విండోలో నిధుల గోల్‌మాల్



విచారణ జరుపుతున్న కో-ఆపరేటివ్ అసిస్టెంట్ రిజిస్ట్రార్ ఆనందం (ఇన్‌సెట్) రైతు రామచంద్ర

- రైతు చెల్లించిన రూ.70వేలు రుణ బకాయి స్వాహా
- బాధితుడి ఫిర్యాదుతో విచారణ

పుంగనూరు, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): పుంగనూరు సింగిల్ విండోలో నిధుల గోల్‌మాల్ వెలుగులోకి వచ్చింది. బాధిత రైతు పుంగనూరు మండలం మాగాండ్లపల్లె పంచాయతీ మద్దనపల్లెకు చెందిన సిద్ధయ్య కుమారుడు ఎస్.రామచంద్ర కలెక్టర్ సుమిత్‌కుమార్‌ను పీజీఆర్ఎస్‌లో విన్నవించడంతో అవకతవకలు వెలుగుచూశాయి. విచారణ చేపట్టాలని పుంగనూరు కో-ఆపరేటివ్ అసిస్టెంట్ రిజిస్ట్రార్ జి.ఆనందంను ప్రభుత్వం ఆదేశించింది. విచారణాధికారి వివరాల మేరకు.. రైతు రామచంద్ర పుంగనూరు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (సింగిల్‌విండో)లో తన రెండు ఎకరాల భూమిని తనఖాపెట్టి 2013 మార్చి 26వ తేదీ స్వల్పకాలిక పంట రుణం రూ.70 వేలు తీసుకున్నారు. 2018 మార్చి 31న రుణం తిరిగి చెల్లించడంతో నాటి ఇన్‌చార్జి సీఈవో, బ్యాంకు సూపర్‌వైజర్ సి.సుబ్రహ్మణ్యం అలియాస్ మణి ఆయనకు పట్టాదారు పాసుపుస్తకాలు వాపసు ఇచ్చారు. కానీ క్లియరెన్స్ రశీదులు ఇవ్వలేదు. మళ్లీ తనకు పంట రుణం కావాలని కోరడంతో రికార్డుల్లో రుణ బకాయిగా ఉన్నప్పటికీ 2019 జనవరి 16న రూ.లక్ష పంట రుణం ఇచ్చారు. ఈ విషయాన్ని ఇన్‌చార్జి సీఈవో సుబ్రహ్మణ్యం, ఆయన తర్వాత వచ్చిన సీఈవో కె.వెంకట్రాముడు సదరు రైతుకు తెలియజేయలేదు. పైగా విచారణలో రామచంద్ర చెల్లించిన రూ.70 వేలుతో తనకు సంబంధంలేదని పేర్కొన్నారు. ప్రస్తుత సీఈవో 2018 నాటి క్యాష్‌బుక్ విచారణకు ఇవ్వలేదు. రైతు రుణాన్ని చెల్లించినా రికార్డులో చూపలేదు. 2019 డిసెంబరు 27 నుంచి 2020 డిసెంబరు 31 వరకు రైతు చెల్లించిన రూ.58,490 సీఈవో వెంకట్రాముడు పాత రుణానికి జమ చేశారు. రైతుకు బకాయి నోటీసు కూడా ఇవ్వలేదు. కానీ బకాయి మాత్రం రికార్డుల్లో చూపారు. ఈ విషయంలో పలు అనుమానాలు ఉన్నాయని, ఇద్దరు అధికారులకు తెలిసే ఈ బాగోతం జరిగి ఉంటుందని విచారణ అధికారి వివరించారు. నిధుల దుర్వినియోగంపై రూ.3,55,812 చెల్లించాలని సీఈవో వెంకట్రాముడుకు చిత్తూరు డిప్యూటీ రిజిస్ట్రార్ నోటీసు ఇచ్చారు. రామచంద్రకు ఇచ్చిన రెండు రుణాల సమయంలో తాను పనిచేయలేదని, తనకు సంబంధం లేదని సీఈవో చెప్పారు. విచారణ నివేదికను చిత్తూరు కో-అపరేటివ్ రిజిస్ట్రార్ ద్వారా కలెక్టర్‌కు పంపారు.

భారీగా ఎస్ఐల బదిలీలు

- 21మందికి స్థాన చలనం -

చిత్తూరు అర్బన్, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): జిల్లాలో పెద్ద సంఖ్యలో ఎస్ఐలను బదిలీ చేశారు. దీర్ఘకాలికంగా పనిచేయడం, ప్రజాప్రతినిధులతో చిన్నపాటి విభేదాలు, జిల్లాకు కొత్తగా తొమ్మిది మంది రావడం వంటి కారణాలతో ఎస్పీ తుషార్ డూడీ ఎస్ఐల బదిలీలకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. జిల్లా వ్యాప్తంగా 21 మందిని బదిలీ చేస్తూ ఆదేశాలు జారీ చేశారు.

● తొమ్మిది మంది ప్రొబేషనరీ ఎస్ఐల బదిలీ

జిల్లాలో శిక్షణ తీసుకుని కొత్తగా పోస్టింగ్ కోసం ఎదురుచూస్తున్న తొమ్మిది మంది ఎస్ఐలకు పోస్టింగ్స్ ఇచ్చారు. పుంగనూరు రూరల్‌లో శిక్షణ తీసుకున్న మణికంఠేశ్వరరెడ్డిని ఎన్ఆర్‌పేట పీఎస్‌కు, చిత్తూరు రూరల్ ఈస్ట్ సర్కిల్‌లో శిక్షణ తీసుకున్న కె.బి.చందనప్రియను బైరెడ్డిపల్లెకు, కల్లూరులో శిక్షణ తీసుకున్న కె.మధుసూదన్‌ను రొంపిచెర్లకు, పలమనేరు రూరల్‌లో శిక్షణ తీసుకున్న బి.జయశ్రీని ఐరాలకు, పలమనేరు రూరల్‌లో శిక్షణ తీసుకున్న ఎ.మారెప్పను పెద్దపంజాణికి, చిత్తూరు వెస్ట్ సర్కిల్‌లో శిక్షణ తీసుకున్న వి. అశోక్‌కుమార్ నాయక్‌ను చిత్తూరు తాలూకాకు, కార్వేటినగరంలో శిక్షణ తీసుకున్న ఎన్. రమేష్‌ను సోమలకు, నగరి రూరల్‌లో శిక్షణ తీసుకున్న ఎన్.మల్లికార్జునను నింద్రకు, చిత్తూరు రూరల్ వెస్ట్ సర్కిల్‌లో శిక్షణ తీసుకున్న డి.తేజశ్వనిని కార్వేటినగరం పీఎస్‌కు పోస్టింగ్ ఇచ్చారు.

● 12 మంది సాధారణ ఎస్ఐల బదిలీ

జిల్లాలో వివిధ పోలీసు స్టేషన్లలో పనిచేస్తున్న 12 మంది ఎస్ఐలను బదిలీ చేశారు. సదుంలో పనిచేస్తున్న షేక్షావలిని వీకోటకు, ఎన్ఆర్‌పేటలో పనిచేస్తున్న నాగసౌజన్యను డీటీసీకి, సోమలలో పనిచేస్తున్న శివశంకరను చిత్తూరు మహిళా స్టేషన్‌కు, రొంపిచెర్లలో పనిచేస్తున్న సుబ్బారెడ్డిని చిత్తూరు సీసీఎస్‌కు, తవణంపల్లెలో ఉన్న చిరంజీవిని చిత్తూరు వన్‌టౌన్‌కు బదిలీ చేశారు. అలాగే గుడుపల్లెలో ఉన్న శ్రీనివాసులును సదుంకు, వెదురుకుప్పంలో ఉన్న వెంకటసుబ్బయ్యను వీఆర్‌కు, వీఆర్‌లో ఉన్న శ్రీనివాసరావును చిత్తూరు డీటీసీకి, వీఆర్‌లో ఉన్న డాక్టర్ నాయక్‌ను తవణంపల్లెకు, వీఆర్‌లో ఉన్న నవీన్‌బాబును వెదురుకుప్పంకు, వీఆర్‌లో ఉన్న పార్థసారథిని చిత్తూరు సీసీఎస్‌కు, వీఆర్‌లో ఉన్న మునికృష్ణను చిత్తూరు సీసీఎస్‌కు బదిలీ చేశారు. బదిలీ అయిన వారందరూ ఒకట్రెండు రోజుల్లో ఆయా స్థానాల్లో బాధ్యతలు తీసుకోవాలని ఉత్తర్వులో పేర్కొన్నారు.

జిల్లాలో 9 స్క్రబ్ టైఫస్ కేసులు

చిత్తూరు రూరల్, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): జిల్లాలో స్క్రబ్ టైఫస్ కేసులు కలవరపెడుతున్నాయి. తాజాగా 9కేసులు నమోదైనట్లు అధికారులు తెలిపారు. చిత్తూరు, పూతలపట్టు, సదుం, కార్వేటినగరం ప్రాంతాల్లో ఈ కేసులు నమోదయ్యాయి. మొత్తం 420 కేసులతో జిల్లా ఫస్ట్ ప్లేస్‌లో ఉంది.

సగం మందికి పైగా జమకాని జీతాలు

చిత్తూరు కలెక్టరేట్, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): పది రోజులు గడిచినా వేతనాలు జమకాలేదని కొందరు ప్రభుత్వ, కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 50 శాతం ఉద్యోగులకు జీతాలు బ్యాంకు ఖాతాల్లో జమ కాలేదని తెలిసింది. ఖజానా, పోలీసు, జ్యుడీషియల్, రెవెన్యూ, మున్సిపాలిటీల్లో పనిచేస్తున్న ఉద్యోగులు తప్ప మెజారిటీ శాఖల ఉద్యోగులకు జీతాలు అందలేదు. రిజిస్ట్రేషన్, కార్మిక సంక్షేమశాఖలతో పాటు పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్, ఆర్‌అండ్‌బీ, వ్యవసాయ శాఖల అనుబంధ శాఖల ఉద్యోగులకు బుధవారం వరకు జీతాలు పడలేదు. జిల్లాలో సుమారు 25వేల మంది ఉద్యోగులు పనిచేస్తున్నారు. ఈఎంఐలు కట్టలేదని, బాడుగలు లాంటివి చెల్లించక ఇబ్బందిపడుతున్నామని వాపోతున్నారు. ఖజానా శాఖ అధికారులను ప్రశ్నిస్తే రాష్ట్ర ఆర్థిక పరిస్థితుల వల్ల ఈ నెల జీతాల పంపిణీలో ఆలస్యమవుతున్నట్లు చెబుతున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక ఎన్ని ఇబ్బందులున్నా నవంబరు వరకు 1 లేదా 2వ తేదీన జీతాలు చెల్లిస్తోంది. ఈ పరిస్థితిపై ఇప్పటికే ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు సూర్యనారాయణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని కలిసి వినతి పత్రం అందించారు. ఈ నెల 13 రెండో శనివారం, 14న ఆదివారం సెలవు రోజులు, 15న సోమవారం జీతాలుపడే అవకాశం లేదంటున్నారు. 16లేదా 17వ తేదీల్లో అందవచ్చని ఉద్యోగులు భావిస్తున్నారు.





ఎర్రమిట్ట వద్ద ఏనుగులు ధ్వంసం చేసిన పైపులు - తొక్కేసిన వరి పైరు

పంట పొలాలపై గజదాడులు

● మధురమలై కొండలో మకాం

సోమల, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలో గజదాడులు కొనసాగుతున్నాయి. ఇరికిపెంట పంచాయతీ ఎర్రమిట్ట సమీపంలో మంగళవారం రాత్రి మూడు ఏనుగులు వరి పైరును తొక్కేసి, మామిడి తోటల్లో కొమ్మలను విరిచేశాయి. ఎర్రమిట్టకు చెందిన భాస్కర్ నాయుడు విద్యుత్ మోటర్, డ్రిప్ పైపులను ధ్వంసం చేశాయి. రెడ్డిబాబు, రెడ్డెప్ప నాయుడు, కృష్ణ, శేఖర్ వరి పొలంలో పంటను తిని, తొక్కేసి నష్టపరిచాయి. బాధిత రైతుల ఫిర్యాదు మేరకు ఎఫ్‌బీవో రాధ పంటలను పరిశీలించి, నష్టాన్ని అంచనా వేశారు.

మధురమలై కొండ ఆవాసంగా..

మండలంలోని ఆవులపల్లె పంచాయతీ ఎగువకొత్తూరు, పత్రపల్లె వైపు నుంచి వచ్చిన ఏనుగులు మధురమలై కొండను ఆవాసంగా చేసుకుని పగలు కొండలో సంచరిస్తూ రాత్రి సమీప పొలాల వైపు వస్తున్నాయి. సోమవారం నెలుకూరివారిపల్లె సమీపంలో టమోటా, వరి పంటల్లో స్వైరవిహారం చేసి బోరు పైపులు, డ్రిప్ పరికరాలను ధ్వంసం చేశాయి. మంగళవారం మధురమలై కొండ వద్ద సంచరించడంతో పశువులను మేతకు తీసుకెళ్లడానికి రైతులు ఇబ్బందిపడ్డారు. మంగళవారం రాత్రి ఎర్రమిట్ట వద్ద పంటలను ధ్వంసం చేశాయి. ఆ పొలాలను బుధవారం ఉదయం సోమల ఏఎంసీ ఛైర్మన్ శ్రీనివాసులు నాయుడు, చెన్నపట్నం చెరువు నీటి సంఘ అధ్యక్షుడు గల్లా బోస్, ఉపాధ్యక్షుడు గౌతం సందర్శించి, అటవీశాఖ అధికారులకు ఫిర్యాదు చేశారు. దాడులు చేయకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పశువుల, మేకల, గొర్రెల కాపరులు అటువైపు వెళ్లరాదని అటవీ శాఖ అధికారులు సూచించారు.

స్వర్ణాంధ్ర లక్ష్యంగా సాగుదాం

● 20 సూత్రాల అమలు కమిటీ ఛైర్మన్ లంకా దినకర్



సమావేశంలో మాట్లాడుతున్న దినకర్, చిత్రంలో కలెక్టర్ సుమిత్‌కుమార్, మేయర్ అముద

చిత్తూరు కలెక్టరేట్, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): స్వర్ణాంధ్ర లక్ష్యంగా ముందుకుసాగుదామని 20 సూత్రాల అమలు కమిటీ ఛైర్మన్ లంకా దినకర్ అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లోనీ మీటింగ్ హాలులో 20 సూత్రాల అమలుపై జిల్లా అధికారులతో సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ విద్య, వైద్యం, స్వర్ణాంధ్ర లక్ష్యసాధనలో జిల్లా అగ్రగామిగా నిలవాలని ఆకాంక్షించారు. ఎన్టీఆర్ వైద్య సేవతో ఆరోగ్య రంగా చిత్తూరు జిల్లా అగ్రభాగాన నిలిచేలా పనిచేయాలన్నారు. కలెక్టర్ సుమిత్‌కుమార్ మాట్లాడుతూ ఉపాధి హామీ ద్వారా రూ.150 కోట్లతో పనులు చేపట్టామన్నారు. చిత్తూరు దాహార్తి తీర్చేందుకు చేపట్టిన అడవిపల్లె రిజర్వాయర్ తాగునీటి పైపులైన్ నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నాయన్నారు. అనంతరం దినకర్ విలేకరులతో మాట్లాడుతూ 2019-24 మధ్య మున్సిపల్ నిధులను అప్పటి ప్రభుత్వం పక్కదోవ పట్టించి సీఎఫ్ఎంఎస్‌లో వేయడం వల్ల నిధుల కొరత ఏర్పడిందన్నారు. సీఎం చంద్రబాబుతో మాట్లాడి మున్సిపల్ నిధులు నేరుగా మున్సిపల్ ఖాతాకే జమయ్యేలా సీఎంను ఒప్పించామని, తద్వారా రూ.13 కోట్లు నేరుగా అందాయని తెలిపారు. పీఎం సూర్యఘర్ పథకంలో మరింత చొరవ చూపాలని కోరారు. ఈ సమావేశంలో సీపీవో శ్రీనివాసులు, డీఎంహెచ్‌వో సుధారాణి, డిప్యూటీ డీఎంహెచ్‌వో వెంకటప్రసాద్, జడ్పీ సీఈవో రవికుమార్, డ్వామా పీడీ రవికుమార్ పాల్గొన్నారు.

అంగన్‌వాడీలకు 5జీ సెల్‌ఫోన్లు

● ఎమ్మెల్యేల ఆధ్వర్యంలో త్వరలో పంపిణీ

చిత్తూరు అర్బన్, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు మరింత వేగవంతంగా సేవలందించడానికి ప్రభుత్వం అంగన్‌వాడీ కార్యకర్తలకు 5జీ సెల్‌ఫోన్లు ఇవ్వాలని నిర్ణయించింది. గత వైసీపీ హయాంలో ఇచ్చిన సామ్‌సంగ్ 3జీ ఫోన్లలో యాప్స్ అందుబాటులో లేకపోవడం, పరిమితికి మించి వివరాలను అప్‌లోడ్ చేయడంతో హ్యాంగ్ అయిపోయాయి. ఈ క్రమంలో సామ్‌సంగ్ 5జీ ఫోన్లు ఇవ్వాలని నిర్ణయించిన ప్రస్తుత ప్రభుత్వం సదరు కంపెనీతో ఒప్పందం చేసుకుంది. జిల్లా వ్యాప్తంగా ఉన్న 2,420 అంగన్‌వాడీ కేంద్రాల్లోని కార్యకర్తలు, వారిని పర్యవేక్షించే సూపర్‌వైజర్లు ఉన్నారు. వీరందరికీ పంపిణీ చేసేందుకు రెండు రోజులుగా జిల్లాలోని ప్రాజెక్టు కార్యాలయాలకు సెల్‌ఫోన్లు చేరవేస్తున్నారు. త్వరలో ఆయా నియోజకవర్గ కేంద్రాల్లో ఎమ్మెల్యేలు, కలెక్టర్‌తో కలిసి పంపిణీ చేసేందుకు ఐసీడీఎస్ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

రొంపిచెర్లలో పర్యావరణ ప్రేమికుడు



చల్లాబాబుతో ముత్తుస్వామి

రొంపిచెర్ల, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణే ధ్యేయంగా ప్రపంచ వ్యాప్తంగా 11 లక్షల మొక్కలు నాటే లక్ష్యంతో సైకిల్ యాత్ర చేస్తున్న తమిళనాడు రాష్ట్రానికి చెందిన ముత్తుస్వామి బుధవారం రొంపిచెర్లకు చేరుకున్నాడు. టీడీపీ పుంగనూరు నియోజకవర్గ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డిని ఆయన స్వగృహంలో కలిశారు. తన లక్ష్యాన్ని వివరిస్తూ ఇప్పటికే 8 లక్షల మొక్కలు నాటినట్లు వివరించారు. రామచంద్రారెడ్డి ముత్తుస్వామిని అభినందిస్తూ లక్ష్యం పూర్తికావాలని ఆకాంక్షిస్తున్నట్లు చెప్పారు. టీడీపీ మండలాధ్యక్షుడు ఉయ్యాల రమణ, గోవర్ధన్‌రెడ్డి, రవికుమార్ పాల్గొన్నారు.



భేరివారిమండపం.. ముత్యాలమ్మ



పెండ్లిమండపం.. పొన్నాలమ్మ



గాంధీవీధి.. అంకమ్మ



కొత్తపేట.. భువనేశ్వరి



బ్రాహ్మణవీధి.. నల్లగంగమ్మ



జయరామరావువీధి.. కావమ్మ





సన్నిధివీధి.. అంకాలమ్మ

కొలువుదీరిన ఏడు గంగమ్మలు

- రాత్రి ఘనంగా నిమజ్జనం
- రోజంతా మొక్కులు చెల్లించుకున్న భక్తులు

శ్రీకాళహస్తికే ప్రత్యేకమైన ఏడు గంగమ్మల జాతర బుధవారం ఘనంగా జరిగింది. అమ్మవారి నామస్మరణతో పట్టణం మార్మోగింది. అమ్మవార్లు కొలువుదీరే ఏడు ప్రాంతాల్లో మూడు రోజుల ముందు నుంచే చలువ పందిళ్లు, విద్యుద్దీపాలతో అలంకరించారు. ఏడు ప్రాంతాల్లో అమ్మవారి ఉత్సవమూర్తులు మంగళవారం అర్ధరాత్రిపైన విశేష అలంకారంలో ఊరేగింపునకు సిద్ధం చేశారు. బుధవారం వేకువజామున మూడు గంటల ప్రాంతంలో ఏడుగంగమ్మలు వరుసగా శ్రీకాళహస్తి న్యాయస్థాన భవనం సమీపంలోని ఏడుగంగమ్మల ఆలయం వద్దకు చేరుకున్నాయి. కుంభం, ప్రత్యేక పూజల తర్వాత అమ్మవార్ల ముసుగు తొలగించి భక్తులకు దర్శనం కల్పించారు. మంగళవాయిద్యాలు, బ్యాండు మేళాలు, సాంస్కృతిక కళాబృందాల ప్రదర్శనలు, యువత చిందుల నడుమ ఏడుగురు అమ్మవార్లు ఒకరి వెనుక ఒకరు.. వరుసగా సాగారు. పలువురు అమ్మవార్లకు కుంభం, కోడిపుంజులు, వేటలు సమర్పించారు. పెండ్లిమండపం నుంచి ఎక్కడి ప్రాంతాల అమ్మవార్లు అక్కడకు వెళ్లి కొలువుదీరారు. పట్టణమంతా ఏడుగంగమ్మలు కొలువుదీరిన ప్రాంతాల్లో భక్తులు అమ్మవార్లను దర్శించుకుని, మొక్కులు చెల్లించుకున్నారు. రాత్రి వరకు భక్తుల రద్దీ కొనసాగింది. ఎటు చూసినా భక్తజన సందడే కనిపించింది. పట్టణంలో ట్రాఫిక్‌ను మళ్లించారు. ఇక, పలువురు భక్తులు అమ్మవారికి అంబళ్లు పోశారు.

కన్నులపండువగా నిమజ్జనం

బుధవారం రాత్రి ఏడుగంగమ్మలు ఆయా ప్రాంతాల నుంచి తిరిగి ఊరేగింపుగా సాగారు. శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా నిర్వహిస్తున్న ముత్యాలమ్మ ఆలయం వద్దకు చేరుకున్నారు. ఆనవాయితీ ప్రకారం అక్కడ ఒక్కో అమ్మవారికి ప్రత్యేక పూజల అనంతరం నిమజ్జనం నిర్వహించారు.

\- శ్రీకాళహస్తి, ఆంధ్రజ్యోతి

సర్వదర్శనానికి 10 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 10 గంటల సమయం పడుతోంది. బుధవారం సాయంత్రం 4 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 31 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 4 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

సోమవారం హుండీ ఆదాయం: రూ.3.96 కోట్లు
మంగళవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 70,901
తలనీలాలు సమర్పించినవారు: 23,128

తిరుమలలో నటి శ్రియ



సినీనటి శ్రియ బుధవారం వేకువజామున తిరుమల శ్రీవారి సుప్రభాతసేవలో పాల్గొన్నారు. తన కుమార్తె రాధా కోస్చీవ్, తల్లి నీరజతో కలిసి ఆమె శ్రీవారి దర్శనం చేసుకున్నారు. ఇంకా కర్ణాటక మాజీ మంత్రి కెఎస్ ఈశ్వరప్ప, ఐపీఎస్ అధికారి విశాల్ గున్నీ కూడా బుధవారం దర్శనం చేసుకున్న వారిలో ఉన్నారు.

\- తిరుమల, ఆంధ్రజ్యోతి

శ్రీవారికి కానుకగా రెండు కార్లు



తిరుమల, డిసెంబరు10(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారికి బుధవారం రెండు కార్లు కానుకగా అందాయి. తిరుపతికి చెందిన లోటస్ ఎలక్ట్రిక్ ఆటో వరల్డ్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ నుంచి అర్జున్ కొల్లికొండ అను భక్తుడు రూ.10 లక్షల విలువైన సిట్రాయెన్(ఈసీ3) ఎలక్ట్రిక్ కారును అందజేశారు. అలాగే చెన్నైకు చెందిన శరవనన్ కరుణాకరన్ అనే భక్తుడు రూ.9 లక్షల విలువైన సిట్రాయెన్(బసాల్ట్ ఎక్స్ ప్లస్ యాంటీ) కారును విరాళంగా ఇచ్చారు. శ్రీవారి ఆలయం ముందు కార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించి తాళాలను శ్రీవారి ఆలయ పేష్కార్ రామకృష్ణకు అందజేశారు.

ఫిర్యాదుల్లో రెవెన్యూ సమస్యలే అధికం



తిరుపతి(కలెక్టరేట్), డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదుల్లో అత్యధికంగా రెవెన్యూ సమస్యలపైనే ఉంటున్నాయని, వాటి పరిష్కారానికి భరోసా కల్పించాలంటూ రెవెన్యూ అధికారులను కలెక్టర్ వెంకటేశ్వర్ ఆదేశించారు. కలెక్టరేట్ వేదికగా బుధవారం జిల్లాలోని అన్ని విభాగాల రెవెన్యూ, ల్యాండ్ అండ్ సర్వే అధికారులతో ఆయన సమీక్షించారు. 'రెవెన్యూ అధికారులంటేనే సమస్యల పరిష్కారంలో కాలయాపన చేస్తారని అపవాదు ఉంది. దీనిని తొలగించాలంటే ప్రజలు ఇచ్చే ఫిర్యాదులపై తక్షణం స్పందించాలి. వాటి పరిష్కారానికి కృషి చేయాలి. అప్పుడే వారికి మనపై, ప్రభుత్వంపై నమ్మకం కలుగుతుంది. కొంతమంది తహసీల్దార్లు, సర్వేయర్ల వ్యవహార శైలిపై ఫిర్యాదులు వస్తున్నాయి. ఇకనైనా వారు పద్ధతి మార్చుకోకుంటే కఠినమైన చర్యలు తీసుకుంటాం. సకాలంలో కుల ధ్రువీకరణ పత్రాలు అందించాలి' అని కలెక్టర్ సూచించారు. రీసర్వే, 22ఏ, అసైన్‌మెంట్ ల్యాండ్స్, ఇనాం భూములు, పొజిషన్ సర్టిఫికెట్లు.. ఇలా పలు అంశాలపై కలెక్టర్ దిశా నిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో నరసింహులు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు దేవేంద్రరెడ్డి, రోజ్మాండ్, ఆర్డీవోలు రామ్మోహన్, భానుప్రకాష్‌రెడ్డి, కిరణ్మయి, జిల్లా ల్యాండ్ అండ్ సర్వే అధికారులు అరుణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



రోడ్డుపై బైఠాయించి నిరసన తెలుపుతున్న విద్యార్థి సంఘాల నాయకులు

నెల్లూరులో కలపాలంటూ గూడూరులో విద్యాసంస్థల బంద్

గూడూరు, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): గూడూరు నియోజకవర్గాన్ని నెల్లూరు జిల్లాలో కలపాలంటూ బుధవారం విద్యార్థి, యువజన సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో విద్యాసంస్థల బంద్ చేపట్టారు. సాధుపేటసెంటర్ వద్ద రోడ్డుపై బైఠాయించి రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థి, యువజన సంఘాల జేఏసీ నాయకులు మాట్లాడుతూ గూడూరును తిరుపతి జిల్లాలో కలపడం వల్ల జిల్లా కేంద్రంలోని కార్యాలయాలకు వెళ్లాలంటే ప్రజలు, ఉద్యోగులు తీవ్ర అవస్థలు పడుతున్నారన్నారు. ఎన్నికల సమయంలో చంద్రబాబునాయుడు, యువగళం పాదయాత్రలో నారా లోకేశ్ ఇచ్చిన హామీలను నెరవేర్చాలన్నారు. ఈ కార్యక్రమంలో మనోజ్‌కుమార్, శశికుమార్, సునీల్‌కుమార్, విద్యార్థులు పాల్గొన్నారు. ఇక, టవర్‌క్లాక్ వద్ద జేఏసీ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే దీక్షలు నాలుగో రోజూ కొనసాగాయి.

- శ్రీసిటీలో 'పేక్స్ ఇండియా'

నీటి నాణ్యత టెస్టింగ్ ల్యాబ్ ప్రారంభం



ల్యాబ్ ప్రారంభోత్సవం సందర్భంగా సిబ్బందితో మాట్లాడుతున్న శ్రీసిటీ ఎండీ

సత్యవేడు, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): శ్రీసిటీలోని పల్ప్ అండ్ పేపర్, ఫుడ్ అండ్ బెవరేజెస్, పెట్రో కెమికల్ రంగాలకు అధునాతన రియాక్టర్ భాగాలను తయారు చేస్తున్న పేక్స్ ఎన్విరాన్‌మెంటల్ టెక్నాలజీ ఇండియా ప్రైవేటు లిమిటెడ్(పీఈటీఐ)సంస్థ తమ ఆవరణలో ఏర్పాటు చేసిన అత్యాధునిక నీటి, మురుగునీటి నాణ్యత టెస్టింగ్ ల్యాబ్‌ని బుధవారం ప్రారంభించింది. ఈ సందర్భంగా శ్రీసిటీ ఎండీ రవీంద్ర సన్నారెడ్డి మాట్లాడుతూ.. శ్రీసిటీని క్లీన్ అండ్ గ్రీన్ పారిశ్రామిక కేంద్రంగా తీర్చిదిద్దే సంకల్పానికి ఇది మరో మైలురాయిగా అభివర్ణించారు. దీని ద్వారా పరిశ్రమలకు వేగవంతమైన, కచ్చితమైన, విశ్వసనీయ నీటి పరీక్ష సేవలు అందుబాటులోకి వస్తాయన్నారు. పేక్స్ ఇండియా మేనేజింగ్ డైరెక్టర్ సుదీప్ సంగమేశ్వరన్ మాట్లాడుతూ, ఈ కొత్త ల్యాబ్ మేక్ ఇన్ ఇండియా ఆలోచనకు అనుగుణంగా అత్యాధునిక టెస్టింగ్ సేవలను అందిస్తుందన్నారు. శ్రీసిటీ పరిశ్రమలు, ఇతర సంస్థలు ఈ సేవలను వినియోగించుకోవాలని కోరారు. ఈ ల్యాబ్ గురించి ఆ సంస్థ వైస్ ప్రెసిడెంట్ (మాన్యుఫ్యాక్చరింగ్, అప్లికేషన్) గణేష్ చిదంబరం ల్యాబ్ గురించి వివరించారు. యూరోపియన్ ప్రమాణాలతో అభివృద్ధి చేసిన ల్యాబ్‌లో 30కిపైగా అంశాలలో నీరు, మురుగునీరుకు సంబంధించిన సర్టిఫైడ్ టెస్టింగ్ అందుబాటులో ఉందని తెలిపారు. ముఖ్యంగా ప్రత్యేక బయోకెమికల్ మీథేన్ పొటెన్షియల్(బీఎంపీ)టెస్టింగ్ ద్వారా పరిశ్రమలు బయోగ్యాస్ రికవరీ సామర్థ్యాన్ని పెంచుకోవచ్చన్నారు.

తిరుపతి నుంచి ఇండిగో విమానాలన్నీ నడుస్తున్నాయి

- ఎయిర్‌పోర్ట్ డైరెక్టర్ భూమినాథన్



వివరాలు వెల్లడిస్తున్న తిరుపతి ఎయిర్‌పోర్ట్ డైరెక్టర్ భూమినాథన్

రేణిగుంట, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): తిరుపతి విమానాశ్రయం నుంచి ఇండిగో విమానాల రాకపోకలు పూర్తి స్థాయిలో పునరుద్ధరించినట్లు తిరుపతి ఎయిర్‌పోర్ట్ డైరెక్టర్ డి.భూమినాథన్ తెలిపారు. డిసెంబరు 7వ తేదీ నుంచి విమానాశ్రయ కార్యకలాపాలు పూర్తిగా సాధారణ స్థితికి వచ్చినట్లు తెలిపారు. ప్రస్తుతం ఇండిగోకు చెందిన అన్ని విమానాలూ తిరుపతి నుంచి షెడ్యూల్ ప్రకారం నడుస్తున్నాయన్నారు. తిరుపతి విమానాశ్రయంలో బుధవారం ఆయన మీడియా సమావేశంలో ఈ వివరాలు వెల్లడించారు. 5, 6 తేదీల్లో మాత్రం ఇండిగో విమానాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడిందన్నారు. డిసెంబరు 5న తిరుపతి విమానాశ్రయానికి రాకపోకలు సాగించాల్సిన 24 విమానాల్లో 18 రద్దుకాగా 6 విమానాలు ఆలస్యంగా నడిచాయన్నారు. అలాగే డిసెంబరు 6న 2 విమానాలు రద్దుకాగా 10 విమానాలు ఆలస్యంగా నడిచాయని వివరించారు. ఈ అంతరాయం కేవలం ఇండిగో విమానాలకు మాత్రమే పరిమితమైందని, ఇతర విమానయాన సంస్థల కార్యకలాపాలు సాధారణంగానే కొనసాగాయని చెప్పారు. అయితే ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఏఏఐ) తిరుపతి విమానాశ్రయం, ఇండిగో ఎయిర్‌లైన్స్ సంయుక్త కార్యాచరణ ప్రణాళికతో పూర్తిస్థాయిలో సహాయక చర్యలు చేపట్టినట్టు భూమినాథన్ తెలిపారు. ప్రయాణికులకు ఆహారం, తాగునీరు, వసతి, విమాన ఛార్జీల పూర్తి రీఫండ్, క్యాబ్ సౌకర్యం, ప్రత్యామ్నాయ ప్రయాణ ఏర్పాట్లు కల్పించినట్టు వివరించారు. ఈ మీడియా సమావేశంలో డీజీసీఏ డైరెక్టర్ దొరైరాజ్, సీఐఎస్ఎఫ్ కమాండెంట్ అనురాగ్‌యాదవ్ పాల్గొన్నారు.

- ఎస్వీయూ బీటెక్ సెకెండ్ సెమిస్టర్

ఫలితాలు ఎప్పుడు?

మూడు నెలలైనా వెల్లడికాని వైనం

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఎస్వీ యూనివర్సిటీ ఇంజినీరింగ్ కాలేజీలో బీటెక్ రెండో సెమిస్టర్ పరీక్షల ఫలితాలు ప్రకటించకపోవడం పట్ల విద్యార్థులు, తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. బీటెక్ కోర్సు మొదటి సంవత్సరానికి సంబంధించిన రెండవ సెమిస్టర్ పరీక్షలు ఆగస్టులో నిర్వహించారు. వివిధ బ్రాంచ్‌లకు సంబంధించిన సుమారు 430 మంది విద్యార్థులు హాజరైనట్టు తెలుస్తోంది. పరీక్షలు పూర్తయి మూడు నెలలకు పైగా గడిచినా ఇంతవరకూ ఫలితాలు విడుదల చేయలేదు. ఇతర కాలేజీల్లో ఫలితాలు ప్రకటించేశారని ఇక్కడ మాత్రం ఎందుకు జాప్యం చేస్తున్నారని అంటున్నారు. కాగా ఆన్‌లైన్ ద్వారా జవాబు పత్రాల మూల్యాంకనం చేయడంతో ఆలస్యమవుతున్నట్టు సమాచారం. బీటెక్ నాలుగు, మూడవ సంవత్సరాలకు సంబంధించిన ఫలితాల విడుదలపై అధికార యంత్రాంగం ప్రత్యేక శ్రద్ధ వహిస్తూ ఉంది. ఎందుకంటే, బీటెక్ నాలుగు, మూడు సంవత్సరాలకు చెందిన విద్యార్థులు ఇతర ఉన్నత విద్య, ఉద్యోగావకాశాల కోసం యూనివర్సిటీ వెలుపలకు వెళ్ళే అవకాశం ఉండడంతో నాలుగు, మూడో సంవత్సరం ఫలితాలను ముందుగా ఇస్తారని, ప్రాధాన్య క్రమంలో మిగతావి ఆలస్యం అవుతాయని అంటున్నారు. త్వరలోనే బీటెక్ సెకెండ్ సెమిస్టర్ ఫలితాలు ప్రకటిస్తామని యూనివర్శిటీ వర్గాలు చెబుతున్నాయి.

జనగణమన జాతీయ గీతం అయ్యింది గాంధీ వల్లే

- నెహ్రూపై ఆరోపణలు అన్యాయం: చింతా మోహన్

తిరుపతి(ఎంఆర్‌పల్లె), డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): 'జనగణమన జాతీయ గీతంగా మారింది మహాత్మా గాంధీ సూచనతోనే. చరిత్ర తెలియని మోదీ ఏదేదో మాట్లాడుతున్నారు' అని కేంద్ర మాజీ మంత్రి చింతా మోహన్ విమర్శించారు. తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ, '1911లో కోల్‌కత్తాలో జరిగిన కాంగ్రెస్ సదస్సులో రవీంద్రనాథ్‌ఠాగూర్ జనగణమన బెంగాలీ గీతాన్ని ఆలపించారు. అది విన్న గాంధీ, ఠాగూర్‌ను మదనపల్లెకు వెళ్లి అనిబిసెంట్‌ను కలవమని చెప్పారు. అలా ఆయన మదనపల్లెలో ఆ గీతాన్ని ఇంగ్లీషులోకి అనువదించారు. అక్కడే బాణీ సమకూర్చారు' అని ఆయన వివరించారు. ఇది తెలియని మోదీ నెహ్రూ మరణించి 60 ఏళ్లు అవుతుంటే, ఇప్పుడు ఆరోపణలు చేయడం అర్థరహితమన్నారు. ప్రజలను తప్పుదారి పట్టించడం తగదని చింతా మోహన్ అన్నారు. టీటీడీ ప్రతిష్ఠ పెంచింది స్థానికులు, కాంగ్రెస్ పార్టీ అని అన్నారు. అలాంటి టీటీడీ నేడు స్థానికులను చిన్నచూపు చూస్తోందన్నారు. ఇక బీజేపీ, టీడీపీకి బ్రేక్ దర్శనాల్లో కోటా ఇస్తున్నారంటూ తప్పుపట్టారు. 2004లో కాంగ్రెస్ చరిష్మాతో రాష్ట్రంలో గెలిచిందని, వైఎస్ రాజశేఖర్‌రెడ్డి వల్ల కాదన్నారు. కాంగ్రెస్ పార్టీ వల్ల పైకి వచ్చిన కుటుంబాల బిడ్డలు పార్టీకి నష్టం చేశారన్నారు. కాంగ్రెస్‌కు పూర్వవైభవం వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు యార్లపల్లి గోపిగౌడ్, రవి, తేజోవతి, శాంతియాదవ్, మునిశోభ, వెంకటేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

'టెట్'కు 92 మంది గైర్హాజరు

తిరుపతి(విద్య), డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): జిల్లాలో బుధవారం జరిగిన టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్(టెట్)కు 92 మంది గైర్హాజరైనట్లు డీఈవో కుమార్ తెలిపారు. ఉదయం 7 కేంద్రాల్లో పరీక్షకు 714 మందికి 659 మంది.. మధ్యాహ్నం 3 పరీక్ష కేంద్రాల్లో 297కి 260 మంది పరీక్షలు రాశారన్నారు. సీసీ కెమెరాల పర్యవేక్షణలో పరీక్షలు నిర్వహించామని, బయోమెట్రిక్ హాజరు నమోదు చేశామని చెప్పారు.

ఇద్దరు అసిస్టెంట్ ప్రొఫెసర్లకు రిమాండ్

తిరుపతి (నేరవిభాగం), డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలోని జాతీయ సంస్కృత వర్సిటీలో లైంగిక వేధింపుల కేసులో అరెస్టయిన అసిస్టెంట్ ప్రొఫెసర్లు లక్ష్మణ్ కుమార్, శేఖర్‌రెడ్డికి బుధవారం రుయాస్పత్రిలో వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం న్యాయమూర్తి ఎదుట పోలీసులు హాజరుపరచగా వారిని విచారించి ఈ నెల 23వ తేదీ వరకు రిమాండ్ విధిస్తూ తీర్పునిచ్చారు.



మంటలు చెలరేగిన కారు



పూర్తిగా దగ్ధమైన కారు

బయోట్రిమ్‌లో కారు దగ్ధం

మంగళం, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): తిరుపతి నగరం కరకంబాడిరోడ్డులోని బయోట్రిమ్‌లో బుధవారం పార్కింగ్ చేసి ఉన్న ఇన్నోవా కారు (కేఏ03 ఏఎం3699) ఇంజన్‌లో షార్ట్‌సర్క్యూట్ కారణంగా దగ్ధమైంది. బయోట్రిమ్‌లో హార్టికల్చర్ సెమినార్‌కు వరదయ్యపాళెం నుంచి కొందరు రైతులువచ్చారు. వారి కారును పార్కు చేసి సెమినార్‌లో పాల్గొన్నారు. ఉదయం 11.30గంటలకు కారులో షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగాయి. బయోట్రిమ్ సిబ్బంది మంటలను ఆర్పడానికి ప్రయత్నించినా వీలు కాకపోవడంతో ఫైర్ సిబ్బందికి సమాచారం ఇచ్చారు. దాదాపు గంట పాటు శ్రమించి ఫైర్ సిబ్బంది మంటలను ఆర్పేశారు. అప్పటికే కారు కాలిపోయింది. అలిపిరి పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించారు.

అమ్మవారి ఆలయంలో వైద్యురాలి పట్ల అనుచిత ప్రవర్తన

- దేహశుద్ధి చేసిన భక్తులు

తిరుచానూరు, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): తిరుచానూరులోని పద్మావతి అమ్మవారి దర్శనానికి బుధవారం సాయంత్రం బెంగళూరుకు చెందిన ఓ యువ వైద్యురాలు కుటుంబసభ్యులతో కలిసి వచ్చారు. ఆలయం లోపల క్యూలైనులో వెళ్తుండగా తెలంగాణ రాష్ట్రం ఖమ్మంకు చెందిన రమేష్.. ఆ వైద్యురాలిపై చేయివేసి అనుచితంగా ప్రవర్తించాడు. ఆమె కేకలు వేయడంతో భక్తులు రమేష్‌ను క్యూలైను నుంచి వెలుపలకు లాక్కొచ్చి చితకబాదారు. అతడిని ఆలయ అధికారులు తిరుచానూరు పోలీసులకు అప్పగించారు. గతంలోనూ ఇతడు ఇదే తరహాలో ప్రవర్తించినట్లు పోలీసుల విచారణలో తేలినట్లు సమాచారం. ఇలాంటి ఘటనలు చోటు చేసుకోకుండా విజిలెన్సు అధికారులు క్యూలైన్లలో మరిన్ని జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉంది.

పోక్సో కేసులో ముద్దాయికి 20 ఏళ్లు జైలు, జరిమానా



ముద్దాయి మణి

చిత్తూరు లీగల్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): పోక్సో కేసులో ముద్దాయికి 20 ఏళ్ల జైలుశిక్ష, జరిమానా విధిస్తూ చిత్తూరు న్యాయస్థానం తీర్పు చెప్పింది. వెదురుకుప్పం మండలం కావుమొండివెంగన పల్లికి చెందిన టి.మణి (32) వెదురుకుప్పం మండల పరిధిలో 8వ తరగతి చదువుతున్న 14 ఏళ్ల బాలికను ప్రేమిస్తున్నానని నమ్మించాడు. తాను చెప్పినట్లు వినకపోతే అమ్మానాన్నలను చంపేస్తానని బెదిరించాడు. ద్విచక్ర వాహనంలో భాకరాపేట వెంకటేశ్వరస్వామి ఆల యం వద్దకు తీసుకెళ్లి బలవంతంగా పెళ్లి చేసుకున్నాడు. ఓ గది అద్దెకు తీసుకుని ఆమెపై అత్యాచారానికి ఒడిగట్టాడు. దీనిపై బాలిక తల్లిదండ్రులు 2020 డిసెంబరు 10వ తేదీన వెదురుకుప్పం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు 2021 మార్చి 22వ తేదీన మణి నుంచి బాలికను రక్షించి తల్లిదండ్రులకు అప్పగించారు. ఈ కేసు బుధవారం చిత్తూరు పోక్సో కోర్టులో వాయిదా ఉండగా పూర్వాపరాలు పరిశీలించిన అనంతరం ముద్దాయిపై నేరం రుజువు కావడంతో 20 ఏళ్ల జైలు, రూ.4,500 జరిమానా విధిస్తూ న్యాయమూర్తి ఎం.శంకర్ రావు తీర్పుచెప్పారు. బాధితురాలికి రూ.లక్ష నష్ట పరిహారాన్ని ప్రభుత్వం తరపున చెల్లించాలని చిత్తూరు కలెక్టర్‌ను ఆదేశించారు. ఈ కేసును స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ మోహనకుమారి వాదించారు.

కర్ణాటక గ్రామీణాభివృద్ధిపై అధ్యయనం



కర్ణాటక రాష్ట్రం గర్గేశ్వరి గ్రామ పంచాయతీ అధికారులతో మాట్లాడుతున్న శాంతిపురం ఎంపీడీవో కుమార్

శాంతిపురం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): కర్ణాటక పంచాయతీరాజ్‌లో అమలవుతున్న సంక్షేమ పథకాలు, అక్కడి గ్రామీణాభివృద్ధిపై అధ్యయనం చేసేందుకు సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ఆదేశాలతో రాష్ట్రం నుంచి వెళ్లిన అధికారుల బృందం క్షేత్ర స్థాయిలో పర్యటిస్తోంది. బుధవారం మైసూరు జిల్లా గర్గేశ్వరి గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని సందర్శించి, గ్రామ పరిపాలనపై అక్కడి అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. ఆన్‌లైన్ సేవలు, రికార్డుల నిర్వహణ తీరును పరిశీలించారు. విధి, విధానాలపై అధ్యయనం చేశారు. పూర్తిగా అవగాహన చేసుకుని ప్రభుత్వానికి నివేదిక ఇస్తామని ఆ బృందంలో సభ్యుడిగా ఉన్న శాంతిపురం ఎంపీడీవో ఏపీఆర్ కుమార్ తెలిపారు.

మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణను రద్దు చేసే వరకు ఉద్యమం



కోటి సంతకాల పత్రాల పెట్టెలను కరుణాకర్‌రెడ్డికి అందజేస్తున్న ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

పుంగనూరు, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని 17 మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణను రద్దు చేసే వరకు వైసీపీ ఉద్యమం కొనసాగుతుందని పుంగనూరు ఎమ్మెల్యే, మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, వైసీపీ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు భూమన కరుణాకరరెడ్డి స్పష్టం చేశారు. మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ వైసీపీ చేపట్టిన కోటి సంతకాల పత్రాల బాక్సులను జిల్లా కేంద్రానికి తరలిస్తున్న వాహనాన్ని వారు బుధవారం జెండా ఊపి ప్రారంభించారు. అంతకుముందు పుంగనూరు ప్రైవేటు బస్టాండ్‌లో వైఎస్సార్ విగ్రహానికి పూలమాలవేసి, నివాళులర్పించారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శి నూతనకాల్వ అనీషారెడ్డి, మాజీ ఎంపీ ఎన్.రెడ్డెప్ప, ఎంపీపీ భాస్కర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ అలీంబాషా తదితరులు పాల్గొన్నారు.

ఇంటిగ్రేటెడ్ లా కోర్సు డీన్ నియామకం



భాస్కరరెడ్డి

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఎస్వీయూలో ఐదేళ్ల ఇంటిగ్రేటెడ్ లా కోర్సు ఇన్‌చార్జి డీన్‌గా ప్రొఫెసర్ భాస్కరరెడ్డి నియమితులయ్యారు. ఆర్కియాలజీ విభాగాధిపతిగా, బీఓఎస్ చైర్మన్‌గా, హాస్టల్ వార్డెన్‌గా, వర్సిటీ ఆర్ట్స్ కాలేజీ వైస్ ప్రిన్సిపాల్‌గా పనిచేశారు. ఈ క్రమంలో ఇంటిగ్రేటెడ్ లా కోర్సు డీన్‌గా నియమితులయ్యారు.

మదనపల్లెలో మిస్సింగ్.. శ్రీనివాసమంగాపురంలో హత్య

ఆలస్యంగా వెలుగు చూసిన ఘటన

చంద్రగిరి, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): అన్నమయ్య జిల్లా మదనపల్లెలో మిస్సింగ్ అయిన వ్యక్తి.. తిరుపతి జిల్లా చంద్రగిరి మండలం శ్రీనివాసమంగాపురంలో హత్యకు గురయ్యారు. ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాలిలా ఉన్నాయి. మదనపల్లె రూరల్‌కు చెందిన ఆవుల నరసింహులు, నాగరాజు, కత్తి నరసింహులు, నారాయణస్వామి.. చంద్రగిరి మండలం నరసింగాపురానికి చెందిన మునిరాజ స్నేహితులు. వీళ్లు తాంత్రిక వైద్యం, గుప్త నిధులు తవ్వకాలు చేస్తుంటారు. అయితే ఆవుల నరసింహులు.. తన భార్యతో సన్నిహితంగా ఉండటంపై నాగరాజు ఆగ్రహించాడు. ముందస్తు పథకం ప్రకారం అక్టోబరు 27వ తేదీన చంద్రగిరిలో తాంత్రిక వైద్యం చేయాలని ఆవుల నరసింహులు, నారాయణస్వామి, కత్తి నరసింహులను మదనపల్లెలో బస్సు ఎక్కించి పంపించాడు. వాళ్లకు తెలియకుండా వెనక మరో బస్సు ఎక్కి శ్రీనివాసమంగాపురంలో నాగరాజు దిగాడు. నరసింగాపురంలోని మునిరాజకు ఫోన్ చేసి ద్విచక్ర వాహనం తీసుకురమ్మని చెప్పాడు. అనంతరం ఆవుల నరసింహులు ఒక్కడినే శ్రీనివాసమంగాపురానికి పిలిపించారు. ద్విచక్ర వాహనంలో అతడిని ఎక్కించుకుని.. మామిడి తోపులోకి నాగరాజు, మునిరాజ తీసుకెళ్లారు. అక్కడ హత్య చేసి, పూడ్చి వేశారు. ఆవుల నరసింహులు కనిపించడంలేదని మదనపల్లె పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా మిస్సింగ్ కేసు నమోదైంది. ఈ కేసు దర్యాప్తులో భాగంగా స్నేహితులనూ విచారించగా.. నాగరాజు, మునిరాజు హత్య చేసినట్లు తెలిసింది. దీంతో మదనపల్లె పోలీసులు గురువారం నిందితులను తీసుకొచ్చి మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించనున్నారు.

22 నుంచి మిషన్ శక్తి అమలుపై సమావేశాలు



బ్యానర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్, అధికారులు

చిత్తూరు కలెక్టరేట్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మహిళా భద్రత, రక్షణ, సాధికారిత కోసం మిషన్ శక్తి కార్యక్రమంపై ఈ నెల 22 నుంచి 27వ తేది వరకు నియోజకవర్గ స్థాయిలో సమీక్షా సమావేశాలు జరపాలని అధికారులను కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదేశించారు. బుధవారం సాయంత్రం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో మిషన్ శక్తి అమలుపై బృందసభ్యులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మహిళల హక్కులను రక్షించే విధంగా వారికి అవసరమైన నైపుణ్యాలను అందజేయాలన్నారు. పోక్సో, అత్యాచారం, గృహ హింస కేసుల రివ్యూలను వేగవంతం చేయాలన్నారు. ప్రతి మండలంలో నెలకోసారి 'భరోసా సంవాద్' సమావేశాలు నిర్వహించాలన్నారు. ప్రతినెలా మహిళా సంఘాలతో కలసి చట్టపరమైన అవగాహన శిబిరం నిర్వహించాలని సూచించారు. ఈ విద్యాసంవత్సరంలోనే 6వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు చదివే అమ్మాయిలకు రాణీరుద్రమ, రక్ష సంరక్షణ శిక్షణ పూర్తిచేయాలన్నారు. అంబులెన్స్ సిబ్బంది, పీహెచ్‌సీ డాక్టర్లకు మెడికో లీగల్ శిక్షణ అందివ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ పీడీ వెంకటేశ్వరి, డీఎంహెచ్‌వో సుధారాణి, డీఈవో వరలక్ష్మితో పాటు వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.



- ఇరకం, ఉబ్బలమడుగు సహా 7 ప్రాంతాల్లో నిర్వహణ

పక్షుల పండుగ రెండు రోజులే..!

తడ, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట కేంద్రంగా ఏటా మూడు రోజుల పాటు అట్టహాసంగా జరిపే పక్షుల పండుగ ఈసారి రెండు రోజులే నిర్వహించనున్నట్లు సమాచారం. 2000 నుంచి ఏటా మూడు రోజుల పాటు పక్షుల పండుగ నిర్వహిస్తున్నారు. ఈ ఏడాది సైతం పాత పద్ధతినే కొనసాగించారు. అయితే వచ్చే ఏడాది జనవరి 10, 11 లేదా 17, 18 తేదీల్లో పక్షుల పండుగ నిర్వహణకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు సమాచారం. అంటే రెండు రోజులే నిర్వహించనున్నారు. గత వారం కలెక్టరేట్‌లో జరిగిన సన్నాహక సమావేశంలో నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది. ఇందుకోసం సుమారు రూ.3 కోట్లు ఖర్చవుతుందని ప్రాథమికంగా అంచనా వేశారు. గతేడాది సూళ్లూరుపేట, నేలపట్టు, అటకానితిప్ప, భీములవారిపాళెం, శ్రీసిటీలో పక్షుల పండుగ జరపగా, ఈ దఫా ఇరకం దీవి, వరదయపాళెం మండలంలోని ఉబ్బలమడుగు జలపాతం వద్ద కూడా నిర్వహించాలని నిర్ణయించినట్లు తెలిసింది. ఇరకందీవిలో కాట్ ఎయిర్ బెలూన్, ఏరో స్పోర్ట్స్, ఉబ్బలమడుగులో ట్రెకింగ్, జలపాతాల వీక్షణ తదితర కార్యక్రమాలు ఉంటాయని తెలుస్తోంది.

కాగా, పక్షుల పండుగకు డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ వచ్చే అవకాశం ఉన్నట్లు సమాచారం.

వరసిద్ధుడి సేవలో ప్రముఖులు



సీఎం రమేష్‌కు జ్ఞాపిక అందిస్తున్న ఈవో పెంచలకిషోర్



రామభూపాల్‌రెడ్డికి జ్ఞాపిక అందిస్తున్న చైర్మన్ మణినాయుడు



లంకా దినకర్‌కు జ్ఞాపిక అందిస్తున్న ఏఈవో రవీంద్రబాబు

ఐరాల(కాణిపాకం), డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): కాణిపాక వరసిద్ధుడిని బుధవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. ఇందులో అనకాపల్లె ఎంపీ సీఎం రమేష్, ఎమ్మెల్సీ భూమిరెడ్డి రామ్‌భూపాల్‌రెడ్డి, 20 సూత్రాల కమిటీ చైర్మన్ లంకా దినకర్ ఉన్నారు. ఆలయ చైర్మన్ మణినాయుడు, ఈవో పెంచలకిషోర్ వారిని ఆహ్వానించి, దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం వేదాశీర్వాద మండపంలో ఆశీర్వదించి, శేష వస్త్రాలు, తీర్థప్రసాదాలు, జ్ఞాపిక అందించారు. ఈ కార్యక్రమంలో ఏఈవో రవీంద్రబాబు, సూపరింటెండెంట్ వాసు, ఆలయ ఇన్‌స్పెక్టర్ బాలాజీనాయుడు పాల్గొన్నారు.

ప్రమాదంలో ప్రజాస్వామ్యం

- భారత రాజ్యాంగానికి ముప్పు
- ఓటు తొలగింపుతో రాజకీయ నరమేధం
- పౌర చైతన్యవేదిక సదస్సులో పరకాల ప్రభాకర్



సమావేశంలో మాట్లాడుతున్న ప్రభాకర్

తిరుపతి(కల్చరల్), డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): దేశంలో ప్రస్తుతం చోటుచేసుకుంటున్న పరిణామాల నేపథ్యంలో ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడిందనే అభిప్రాయాన్ని ప్రముఖ ఆర్థికవేత్త, విశ్లేషకుడు పరకాల ప్రభాకర్ వ్యక్తం చేశారు. రాజ్యాంగానికి ముప్పు పొంచి ఉందని వ్యాఖ్యానించారు. తిరుపతి అఫీసర్స్ క్లబ్‌లో మానవ హక్కుల దినోత్సవం సందర్భంగా పౌర చైతన్య వేదిక రాష్ట్ర తొలి సదస్సులో బుధవారం ఆయన మాట్లాడారు. 'రెండున్నరేళ్లుగా మణిపూర్ అట్టుడికిపోతోంది. చాలా మంది ప్రాణాలు కోల్పోగా మహిళలను నగ్నంగా ఊరేగించిన సంఘటనలు వెలుగుచూశాయి. ఇక దేశ ప్రధాన న్యాయస్థానంలో జడ్జిపై చెప్పు విసిరిన సంఘటన జరిగింది. అయినా దేశంలో స్పందన కరువైంది' అని ఆవేదన వ్యక్తం చేశారు. అయితే, పార్లమెంటులో ఆరు దశాబ్దాల కిందటి వందేమాతరం అంశం మీద మాత్రం పది గంటలు చర్చ జరిగిందని విమర్శించారు. ఎస్ఐఆర్ గురించి మాట్లాడుతూ, 'ఒకప్పుడు ప్రభుత్వాన్ని ఓటరు ఎన్నుకునేవారు. ఇప్పుడు ప్రభుత్వం ఓటరుగా ఎవరుండాలో ఎన్నుకుంటోంది' అన్నారు. తమ అనుకూలతల కోసం ఓటును తొలగించడం రక్తపాతంలేని రాజకీయ నరమేధంగా అభివర్ణించారు. ఇలా మాట్లాడే అవకాశం ఎప్పటికీ ఇలానే ఉంటుందన్న నమ్మకం కనిపించడం లేదన్నారు. ఏ క్షణమైనా లోపలకు వెళ్లిపోవచ్చు.. ఈ సభలకు వచ్చివారిలో కొంత మందికి కూడా ఆ పరిస్థితి రావచ్చేమోననే సందేహాన్ని పరకాల ప్రభాకర్ వ్యక్తం చేశారు. ఈ పరిస్థితులపై పౌరులంతా కార్యరంగంలోకి రావాలి, లేకపోతే మనుగడ ప్రశ్నార్థకంగా మారుతుందన్నారు. సెంటర్ ఫర్ ప్రొటెక్షన్ ఆఫ్ డమోక్రటిక్ రైట్స్ అండ్ సెక్యులరిజం(సీపీడీఆర్ఎస్) జాతీయ ప్రధాన కార్యదర్శి కుంచె శ్రీధర్ మాట్లాడుతూ చొరబాటుదారులను ఏరివేయడానికి స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్(ఎస్ఐఆర్) ఏర్పాటు చేశామని చెబుతున్న ఎలక్షన్ కమిషన్‌కు ఎవరు పౌరులో, ఎవరు కాదో తేల్చే బాధ్యత ఎవరిచ్చారని ప్రశ్నించారు. తప్పులపైన తప్పులు చేస్తూ ఎలక్షన్ కమిషన్ మానవ హక్కుల ఉల్లంఘనకు పాల్పడుతోందన్నారు. పౌర చైతన్య వేదిక విశాఖపట్నం జిల్లా అధ్యక్షుడు ప్రొఫెసర్ కోలవెను చాంద్ ఎస్ఐఆర్‌ను ఉపసంహరించుకోవాలని, కర్నూలు జిల్లా అధ్యక్షులు ఓంకార్ వివాదాస్పద కార్మిక చట్టాలను వ్యతిరేకిస్తూ, తిరుపతి జిల్లా కార్యదర్శి ఏఎస్.పరమేశ్వరరావు పెగాసెస్ వైరస్‌ను పోలిన సంచార సాథియా ఎను వ్యతిరేకిస్తూ ప్రవేశపెట్టిన తీర్మానాలను సదస్సులో ఏకగ్రీవంగా ఆమోదించారు. ఈ కార్యక్రమంలో పౌర చైతన్య వేదిక సభ్యులు, మేధావులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆ బాంబులు ఎప్పుడైనా పేలొచ్చు

- వ్యవసాయ కళాశాలకు నాలుగోసారి బెదిరింపు
- ఉత్తుత్తిదేనని తేల్చిన పోలీసులు



తనిఖీలు చేస్తున్న పోలీసులు

తిరుపతి(నేరవిభాగం), డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): 'వాష్‌రూములో ఏడు ఆర్డీఎక్స్ ఆధారిత పేలుడు పదార్థాలు పెట్టాం. అవి ఏ సమయంలోనైనా పేలొచ్చు' అంటూ తిరుపతిలోని వ్యవసాయ కళాశాలకు బుధవారం ఈమెయిల్ వచ్చింది. భయాందోళనకు గురైన అధికారులు వెంటనే తిరుపతి రూరల్ సీఐ చిన్నగోవిందుకు సమాచారమిచ్చారు. పోలీసులు, డాగ్, బాంబు స్క్వాడ్‌లు కళాశాలలోని ప్రిన్సిపల్ సహా అన్నిచాంబర్లు, గదులు, హాస్టళ్లు, చుట్టు పక్కల ప్రాంతాల్లో తనిఖీలు చేశారు. ఎక్కడా బాంబులు లేవని, ఫేక్ మెయిల్స్ అని తేల్చారు. కాగా, వ్యవసాయ కళాశాలకే బాంబు బెదిరింపు మెయిల్స్ రావడం ఇది నాలుగోసారి. తొలుత గతేడాది నవంబరు 17న, డిసెంబరు 18న, ఈ ఏడాది మే 28న, ఇప్పుడు తాజాగా.. వ్యవసాయ కళాశాలకు బెదిరింపులు రావడం గమనార్హం.

అప్పుడు క్రిస్టియన్.. ఇప్పుడు ఎస్సీ!

- పదవి కోసం మున్సిపల్ చైర్మన్ కుల ధ్రువీకరణలో మార్పులు

పుత్తూరు అర్బన్, డిసెంబరు10 (ఆంధ్రజ్యోతి): పదవుల కోసం నిబంధనలకు విరుద్ధంగా కుల ధ్రువీకరణ మార్చుకున్న ఘటన పుత్తూరు మున్సిపాలిటీలో వెలుగు చూసింది. ప్రస్తుత మున్సిపల్ చైర్మన్ అనంగి హరి గతంలో క్రిస్టియన్‌గా కుల ధ్రువీకరణ పొంది మున్సిపల్ కౌన్సిల్ కోఆప్షన్ సభ్యుడిగా నియమితులయ్యారు. గత ప్రభుత్వంలో మున్సిపల్ చైర్మన్ పదవి ఎస్సీకి రిజర్వు కాగా, ఎస్సీ ధ్రువీకరణ పత్రాన్ని పొంది చైర్మన్ అయ్యారు. దీనిపై కలెక్టర్ వెంకటేశ్వర్‌కు ఫిర్యాదు వెళ్లడంతో విచారణకు ఆదేశించారు. క్రిస్టియన్‌గా జారీ చేసిన ధ్రువీకరణ పత్రం, తిరిగి ఎస్సీ ధ్రువీకరణ పత్రం జారీలో నిబంధనలు పాటించలేదని పుత్తూరు తహసీల్దార్ కలెక్టర్‌కు నివేదిక సమర్పించినట్లు తెలిసింది. ఈ నివేదిక మేరకు మున్సిపల్ చైర్మన్ పదవి నుంచి తొలగించాలని కలెక్టర్ పురపాలక శాఖ ఉన్నతాధికారులకు నివేదించినట్లు సమాచారం. మున్సిపల్ అధికారులకూ సమాచారం అందించినట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో ఆయన పదవి కూడా కోల్పోయే పరిఅనంతరం ఆయన పదవి కూడా కోల్పోయే పరిస్థితి నెలకొంది.

రోడ్డు ప్రమాదంలో లారీ క్లీనర్ మృతి



వెంకటేష్ (ఫైల్‌ఫొటో)

యాదమరి, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలో మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో లారీ క్లీనర్ మృతి చెందాడు. ఎస్ఐ ఈశ్వర్ వివరాల మేరకు.. తమిళనాడు రాష్ట్రం పరదరామి వరదరెడ్డిపల్లి గ్రామానికి చెందిన గోపాల్ కుమారుడు వెంకటేష్ (37) యాదమరిలోని ఐవోసీఎల్ సంస్థలో లారీ క్లీనర్‌గా పనిచేస్తున్నాడు. మంగళవారం రాత్రి యాదమరి నుంచి ద్విచక్ర వాహనంపై స్వగ్రామానికి వెళుతున్నాడు. చిత్తూరు - గుడియాత్తం అంతర్రాష్ట్ర రహదారి నారాయణపురం వద్ద ముందు వెళ్తున్న ట్రాక్టర్‌ను ఢీకొట్టాడు. వెంకటేష్ తలకు తీవ్రగాయాలు కావడంతో ఘటనా స్థలంలోనే మృతిచెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

కారు డ్రైవర్ ఆత్మహత్య



రాజేష్ (ఫైల్‌ఫొటో)

యాదమరి, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): మద్యానికి డబ్బులు ఇవ్వలేదనే కోపంతో యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని పాచిగుంట గ్రామం లో బుధవారం చోటుచేసుకుంది. స్థానికుల వివరాల మేరకు.. పాచిగుంట గ్రామానికి చెందిన రాము కుమారుడు రాజేష్ (27) కారు డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. మద్యానికి అలవాటుపడిన అతను బుధవారం కుటుంబ సభ్యులను డబ్బులు అడిగాడు. నిరాకరించడంతో కోపంతో విషం తాగాడు. అపస్మారక స్థితికి చేరుకోవడంతో చికిత్స నిమిత్తం చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలోనే ప్రాణాలు కోల్పోయాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి



మృతిచెందిన లోకనాథ్

శాంతిపురం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : కుప్పం - పలమనేరు జాతీయ రహదారిలోని మఠం హెరిటేజ్ (ప్యాక్‌హౌస్) వద్ద బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందాడు. స్థానికులు, పోలీ సుల వివరాల మేరకు.. వి.కోట మండలం దాసార్లపల్లె గ్రామానికి చెందిన లోకనాథ్(25) సొంత పని నిమిత్తం ద్విచక్ర వాహనంలో శాంతిపురానికి వెళుతున్నాడు. కుప్పం - పలమనేరు జాతీయ రహదారిలోని మఠం హెరిటేజ్ (ప్యాక్‌హౌస్) వద్ద వి.కోట నుంచి కుప్పం వైపు వెళుతున్న వ్యాను వెనుక వైపు నుంచి ఢీకొంది. ఈ ప్రమాదంలో లోకనాథ్ అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికులు ఇచ్చిన సమాచారంతో రాళ్లబూదు గూరు పోలీసులు అక్కడికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కుప్పం వంద పడకల ఆస్పత్రికి తరలించారు. పోస్టుమార్టం అనంతరం బంధువులకు అప్పగించారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

పలమనేరు
కుప్పం/పుంగనూరు

ఎలక్ట్రిక్ సైకిళ్లను వినియోగించుకోండి



కుప్పంలో నమూనా సైకిళ్లను ప్రదర్శిస్తున్న కన్నన్ తదితరులు

కుప్పం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్రభుత్వం సబ్సిడీపై అందిస్తున్న ఎలక్ట్రిక్ సైకిళ్లను కొనుగోలు చేసి వినియోగించాలని కుప్పం మున్సిపాలిటీ 11వ క్లస్టర్ టీడీపీ ఇన్‌చార్జి కన్నన్, బెస్తకుల కార్పొరేషన్ డైరెక్టర్ తిరుమగళ్, యూనిట్ ఇన్‌చార్జి అప్పు ముఖేశ్ మహిళలను కోరారు. కుప్పం మున్సిపాలిటీ పరిధిలోని కొత్తపేట 5వ సచివాలయంలో బుధవారం వారు నమూనా ఎలక్ట్రిక్ సైకిళ్లను ప్రదర్శించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు కడా ద్వారా సబ్సిడీ పై ఎలక్ట్రిక్ సైకిళ్లను చిరు వ్యాపారుల కోసం అందిస్తున్నారన్నారు. ఈ సైకిళ్ల వినియోగంతో పర్యావరణ సంరక్షణ జరుగుతుందన్నారు. సంప్రదాయ ఇంధనమైన పెట్రోలు వాహనాలు వెలువరించే కర్బన ఉద్గారాలు అదుపులోకి వస్తాయని, తద్వారా వాతావరణ కాలుష్యం నివారించబడి ప్రజారోగ్యం మెరుగుపడుతుందన్నారు. బ్యాంకులు అందిస్తున్న వాయిదా రుణ సదుపాయం ఎలక్ట్రిక్ సైకిళ్ల కొనుగోలు భారాన్ని తగ్గిస్తుందని, ప్రతిఒక్కరూ ఎలక్ట్రిక్ సైకిళ్లను కొనుగోలు చేసి వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ కృష్ణన్, నాయకులు మురళీ, ఉదయకుమార్, కృష్ణ నాటార్, హరినాథ్ గౌడ్, మెప్మా సిబ్బంది, సచివాలయ ఉద్యోగులు, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

పలమనేరు మార్కెట్ యార్డు అభివృద్ధికి సహకరించండి



సీఎం చంద్రబాబు, మంత్రి అచ్చెన్నాయుడులను కలిసిన రాజన్న

పలమనేరు, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): పలమనేరు వ్యవసాయ మార్కెట్ యార్డు అభివృద్ధికి సహకరించాలని ఏఎంసీ చైర్మన్ రాజన్న ముఖ్యమంత్రి చంద్రబాబు, వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడులను మంగళవారం సాయంత్రం అమరావతిలో కలిసి వినతిపత్రం అందించారు. పలమనేరులో ప్రస్తుతం ఉన్న వ్యవసాయ మార్కెట్ యార్డును ఇంటిగ్రేటెడ్ మార్కెట్ యార్డుగా అభివృద్ధి చేసేందుకు నిధులు మంజూరు చేసి సహకరించాలని కోరారు. మార్కెట్‌లో వాహనాల రాకపోకలకు ఇబ్బంది ఉన్న కారణంగా స్థానిక రైతులు అధికశాతం తమ వ్యవసాయ ఉత్పత్తులను కర్ణాటక మార్కెట్‌కు తరలిస్తున్నారని వివరించారు. ఇంటిగ్రేటెడ్ మోడల్ మార్కెట్ ఏర్పాటుతో చెన్నై, బెంగళూరు నగరాలకు రైతులు తమ పంటలను ఎగుమతి చేసుకొనే వెసులుబాటు ఉంటుందని .. స్థానిక రైతులకు గిట్టుబాటు ధర పొందేందుకు అవకాశం ఉంటుందని వివరించారు. మరోవైపు కుప్పం-క్రిష్ణగిరి రహదారి విస్తరణ త్వరలోనే ఏర్పాటు కానున్నందున రామకుప్పం మండలంలో రానున్న కార్గో విమాన సేవలతో ఇక్కడి వ్యవసాయ ఉత్పత్తులు విదేశాలకు తరలించుకోవడానికి వీలుంటుందని తెలిపారు. పలమనేరు మార్కెట్‌యార్డును అన్ని విధాలుగా అభివృద్ధి చేసేందుకు సహకరించాలని విన్నవించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సానుకూలంగా స్పందించినట్లు ఏఎంసీ చైర్మన్ రాజన్న తెలిపారు.

విద్యార్థినులకు భూసార పరిరక్షణపై అవగాహన



భూసార పరిరక్షణపై అవగాహన కల్పిస్తున్న లక్ష్మీప్రసన్న

పలమనేరు, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): పలమనేరులోని బాలికల గురుకుల పాఠశాలలోని విద్యార్థినులకు బుధవారం జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయ అధికారిణి లక్ష్మీప్రసన్న, ఆత్మ బీటీఎం సుకుమార్ భూసార పరిరక్షణపై అవగాహన కల్పించారు. విద్యార్థినులకు మట్టినమూనా ప్రాముఖ్యత, మట్టి నమూనా సేకరించు విధానం, సేకరించిన మట్టిని ఎలా పరిశీలించాలో నేర్పించారు. మొక్కలు ఆరోగ్యంగా పెరగడానికి మంచి పోషకాలు ఉన్న మట్టి అవసరమని వివరించారు. భూమి నాణ్యతను కాపాడుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ప్రశాంతి, విద్యార్థినులు పాల్గొన్నారు.

ప్రజారోగ్యంపై సీఎం ప్రత్యేక శ్రద్ధ



వైద్యాధికారితో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కంచర్ల, సురేశ్‌బాబు

కుప్పం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రజారోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టారని ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, పీకేఎం ఉడా చైర్మన్ డాక్టర్ బీఆర్.సురేశ్‌బాబు అన్నారు. కుప్పం ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో బుధవారం బెంగళూరు జీవన్ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత డయాబెటిస్ ఫుట్ చెకప్ శిబిరాన్ని వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఉచిత ప్రత్యేక శిబిరాలతోపాటు ప్రభుత్వ ఆస్పత్రుల్లో అత్యాధునిక వైద్య సేవలు, ఆరోగ్య నమోదు కేంద్రాలు ఏర్పాటు చేయడంతో ప్రభుత్వం ప్రజలకు నిరంతర సేవలందిస్తున్నారన్నారు. ఈ సేవలను ప్రజలు వినియోగించుకోవాలని కోరారు. పలువురు వైద్య ప్రముఖులు, నాయకులు, ప్రజాప్రతినిధులు, ప్రజలు పాల్గొన్నారు.

కౌమార దశలో మరిన్ని జాగ్రత్తలు అవసరం



వైద్య బృందంతో ప్రధానోపాధ్యాయురాలు పద్మజవాణి తదితరులు

కుప్పం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): కౌమార దశలో బాలికలు మరిన్ని జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉందని మంగళగిరి నుంచి వచ్చిన ఎయిమ్స్ ఆస్పత్రి బృందం సభ్యుడు కౌన్సిలర్లు డాక్టర్ ఎండీ.మహమ్మద్ షాజాద్, జాన్, శ్రావణి అన్నారు. ఆంధ్రప్రదేశ్ సాంఘిక సంక్షేమ గురుకులాల మంత్రి డాక్టర్ డోల బాల వీరాంజనేయస్వామి, కార్యదర్శి వెంకటేశ్ ఆదేశాలతో కుపన్పంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో బుధవారం మంగళగిరికి చెందిన ఎయిమ్స్ ఆస్పత్రి వైద్య బృందం కౌమార దశలో బాలికలు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రెండురోజుల శిక్షణ ఇచ్చింది. శిక్షణ ముగింపు రోజైన బుధవారం జరిగిన కౌన్సెలింగ్‌లో వారు మాట్లాడుతూ కౌమార దశలో త్వరగా బాలికలు ఆవేశాలకు, ఇతర అనుబంధాలకు ప్రభావితులయ్యే అవకాశం ఉందని తెలిపారు. తెలిసీ తెలియని వయసులో బాలికలు తమ ఆలోచనలను అదుపులో ఉంచుకోవాలని సూచించారు. అలాగే తల్లిదండ్రులు బాలికలపై మరింత జాగ్రత్త వహించాలని హెచ్చరించారు. కార్యక్రమంలో సాంఘిక సంక్షేమ గురుకులాల చిత్తూరు, తిరుపతి జిల్లాల సమన్వయ అధికారి టి.పద్మజ, జిల్లా సంక్షేమ శాఖాధికారి డాక్టర్ సుధాకర్, ప్రధానోపాధ్యాయులు పద్మజవాణి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

13న కుప్పం మండల సమావేశం

కుప్పం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): కుప్పం మండల సర్వసభ్య సమావేశం ఈనెల 13వ తేదీ ఉదయం 10.30 గంటలకు జరుగుతుందని ఎంపీడీవో తెలిపారు. ఎంపీపీ ఆధ్వర్యంలో జరిగే సమావేశానికి జిల్లా పరిషత్తు ప్రాదేశిక నియోజకవర్గ సభ్యులు, మండల ప్రాదేశిక నియోజకవర్గ సభ్యులు, సర్పంచులు హాజరు కావాలని కోరారు. మండలానికి సంబంధించిన అభివృద్ధి, ప్రజా సమస్యలపై సమావేశంలో చర్చించి తీర్మానాలు ఆమోదిస్తామని చెప్పారు.

పన్నులు చెల్లించాలనే ఫోన్ కాల్స్ నమ్మొద్దు

కుప్పం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఫోన్ పే, గూగుల్ పేలతో ట్రేడ్ లైసెన్సులు, ఇతర పన్నులు చెల్లించమని వస్తున్న ఫోన్ కాల్స్‌ను నమ్మొద్దని కుప్పం మున్సిపల్ కమిషనర్ వి.శ్రీనివాసరావు ప్రజలను హెచ్చరించారు. కమిషనర్, కుప్పం పురపాలక సంఘం పేరుతో కొందరు ఫేక్‌ఫోన్ కాల్స్ చేసి ఫోన్ పే, గూగుల్ పేలతో ట్రేడ్ లైసెన్సులు చెల్లించమంటూ ఒత్తిడి చేస్తున్నట్లు తమకు ఫిర్యాదులు అందాయన్నారు. అటువంటి కాల్స్‌కు స్పందించవద్దన్నారు. అలా పన్నులు చెల్లించమని మున్సిపల్ సిబ్బంది ఎవరూ ఫోన్ కాల్స్ చేయడం లేదని తెలిపారు. అటువంటి ఫోన్ కాల్స్ ఎవరికైనా వస్తే నేరుగా పురపాలక సంఘ కార్యాలయంలోని కౌంటర్ ద్వారా మాత్రమే పన్నులు చెల్లించి రసీదు పొందాలని కమిషనర్ వి.శ్రీనివాసరావు ప్రజలకు సూచించారు.

ఉచిత వైద్య శిబిరాలు పేదలకు వరం



వైద్య శిబిరంలో పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

కల్లూరు, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రజలకు ఉచిత వైద్య శిబిరాలు ఓ వరంలాంటివని టీడీపీ నాయకులు ధనంజయ నాయుడు, కుమార్‌రెడ్డి, వైద్యాధికారులు గాంధీ, కిరణ్మయి తెలిపారు. పులిచెర్ల మండలం కల్లూరు జడ్పీ గెస్ట్‌హౌస్ ఆవరణలో బుధవారం తిరుపతి అమర ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ ఉచిత వైద్య శిబిరానికి హాజరైన రోగులకు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. శిబిరానికి 90 మంది రోగులు హాజరుకాగా 9 మంది శస్త్ర చికిత్సలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా డాక్టర్లు మాట్లాడుతూ ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

బండకిందపల్లె పాఠశాల తనిఖీ



విద్యార్థులతో మాట్లాడుతున్న ఎంపీడీవో మధుసూదన్‌రెడ్డి

రొంపిచెర్ల, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బండకిందపల్లె పాఠశాలను బుధవారం ఎంపీడీవో మధుసూదన్‌రెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలోని అన్ని తరగతి గదులకు వెళ్లి విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. మధ్యాహ్నం భోజనం నాణ్యతపై ఆరా తీశారు. ఉపాధ్యాయులు, పిల్లల హాజరు తెలుసుకున్నారు. మెనూ ప్రకారమే మధ్యాహ్న భోజనం ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఈవో శ్రీనివాసులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉదయకుమార్‌కు డాక్టరేట్



శాంతిపురం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని 121పెద్దూరు గ్రామ పంచాయతీ బెండనకుప్పం గ్రామానికి చెందిన వెంకటాచపలతి కుమారుడు ఉదయకుమార్‌కు డాక్టరేట్ సాధించాడు. ఉదయకుమార్ కర్ణాటక రాష్ట్రం కేజీఎఫ్‌లోని జైన్ డిగ్రీ కళాశాలలో అధ్యాపకుడిగా విధులు నిర్వహిస్తున్నారు. ఆయన ఆళ్వార్ నగరంలోని సన్‌రైజ్ యూనివర్సిటీలో నుంచి గణితశాస్త్రంలో చేసిన అన్వేషణపై పీహెచ్‌డీ పట్టా అందుకున్నట్లు ఉదయకుమార్ తెలిపారు.

దాసరి రిజర్వేషన్ పోరాట సమితి గ్రామాధ్యక్షుడిగా గోవిందు



నియామక పత్రాన్ని అందిస్తున్న సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రవి

చౌడేపల్లె, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : దాసరి రిజర్వేషన్ పోరాట సమితి గ్రామ అధ్యక్షుడిగా గోవిందు సంతోషను నియమించినట్లు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రవి పేర్కొన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న సంక్షేమ పథకాలను దాసరి కులాల వారికి, విద్యార్థుల ఉన్నత చదువులకు ప్రత్యేక చర్యలు తీసుకోనున్నట్లు వివరించారు. కార్యక్రమంలో గోవిందు, శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.

ఏపీ ఎలక్ట్రిసిటీ యూనియన్ ప్రధాన కార్యదర్శిగా మురళీధర్



సమావేశంలో మాట్లాడుతున్న రాఘవరెడ్డి

చౌడేపల్లె, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఏపీ ఎలక్ట్రిసిటీ యూనియన్ డిస్కం ప్రధాన కార్యదర్శిగా మురళీధర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు రాష్ట్ర జనరల్ సెక్రటరీ రాఘవరెడ్డి, డిస్కం అధ్యక్షులు రాఘవేంద్రప్రసాద్ అన్నారు. ప్రముఖ పుణ్యక్షేత్రమైన బోయకొండలో యూనియన్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఎన్నికల పరిశీలకులు వెంకటేశ్వరరావు సమక్షంలో అధ్యక్షుడిగా లక్ష్మీకాంతరెడ్డి, కోశాధికారిగా గోపినాథ్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ప్రహ్లాదాచారి, ఉపాధ్యక్షుడిగా వెంకటా చలపతిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు. యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా రహదారులు !



పుంగనూరు ఎన్ఎస్‌పేట వద్ద అధ్వానంగా ఉన్న రోడ్డు



గోతులమయంగా మారిన మేలుందొడ్డి రోడ్డు

పుంగనూరు, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): పుంగనూరు రోడ్లు అడుగడుగునా గోతులమయంగా అధ్వానంగా తయారవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కొద్దిపాటి వర్షం పడినా గోతుల్లో బురదనీరు చేరినా పట్టించుకునే నాథుడే కరువయ్యారు. పుంగనూరు పుంగమ్మచెరువు క్రాస్ నుంచి ఎన్ఎస్‌పేట, ప్రభుత్వాస్పత్రి, శుభారాం ప్రభుత్వ డిగ్రీ కాలేజీ మీదుగా రామసముద్రం వెళ్లే రోడ్డుపై గోతులతో వాహనచోదకులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ రోడ్డులో ప్రయాణాలంటే ప్రజలు, విద్యార్థులు, ఉద్యోగులు, మహిళలు, రైతులు హడలిపోతున్నారు. అలాగే ఎన్ఎస్ పేట మసీదు క్రాస్ నుంచి వనమలదిన్నె, మేలుందొడ్డి, ఏడూరు రోడ్డు గోతులతో నిండింది. ఈ మార్గంలో కర్ణాటక సరిహద్దుకు వెళ్లాలంటే ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. ఇటీవల పుంగనూరులో అధ్వానంగా ఉన్న రోడ్లపై దృష్టి పెట్టాలని మున్సిపల్ మీట్‌లో కౌన్సిలర్లు కోరగా దుస్థితిలో ఉన్న రోడ్లు ఆర్‌అండ్‌బీ పరిధిలో ఉన్నాయని, మున్సిపాలిటీ ఏమీ చేయలేదని కమిషనర్ మధుసూదన్ రెడ్డి చెప్పారు. ఇటీవల పుంగమ్మ చెరువు నుంచి సింగిరిగుంట, అరవపల్లె, కతార్లపల్లె క్రాస్ వరకు ఉన్న ఆరు కిలోమీటర్లు పెద్దపెద్దగోతులతో అధ్వానంగా ఉన్న రోడ్డు తో కర్ణాటకకు వెళ్లే ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పుంగనూరు టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి ఆర్‌అండ్‌బీ మంత్రి జనార్దన్‌రెడ్డి, కలెక్టర్ సుమిత్‌కుమార్ దృష్టికి తీసుకెళ్లగా తాత్కాలిక మరమ్మతులతో రోడ్డు బాగుపడింది. ఈ రెండు మార్గాల్లోని రోడ్లను బాగు చేయడానికి నాయకులు, అధికారులు చొరవచూపాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రధాన రహదారితో గుంతలు

● **బైరెడ్డిపల్లె:** బైరెడ్డిపల్లె నుంచి నాలుగు రోడ్లకు వెళ్లే ప్రధాన రహదారిలో అక్కడక్కడా గుంతలు ఏర్పడి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. రహదారి మధ్యలో ఉన్న గుంతలతో వాహనచోదకులు ప్రమాదాల బారిన పడుతున్నారు. దగ్గరికి వస్తేగాని గుంతలున్న విషయం తెలియక వాహనాలు అదుపుతప్పి ప్రమాదాలు జరగడం ఇటీవల అధికమవుతోంది. ఇప్పటికే పలువురు బైరెడ్డిపల్లె- నాలుగురోడ్ల రహదారిలో ఉన్న గుంతల్లో పడి క్షతగాత్రులై ఆస్పత్రుల పాలయ్యారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు తగిన శ్రద్ధ తీసుకొని రహదారిలో ఉన్న గుంతలను పూడ్చి ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



బైరెడ్డిపల్లె నుంచి నాలుగురోడ్లకు వెళ్లే రహదారిలో ఉన్న గుంతలు

ఆటలు ఆరోగ్యానికి ఉత్తమ మార్గం

కుప్పం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): శారీరక మానసిక ఆరోగ్యానికి ఆటలు ఉత్తమమైన మార్గమని ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, ఏపీఎస్ఆర్టీసీ వైస్ చైర్మన్ పీఎస్.మునిరత్నం పీకేఎం ఉడా చైర్మన్ డాక్టర్ బీఆర్.సురేశ్‌బాబు అన్నారు. కుప్పంలోని డాక్టర్ వైసీ జేమ్స్ యెన్ ప్రభుత్వ పాలిటెక్నిక్‌లో బుధవారం ఇంటర్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్ (ఏపీఎస్‌జీఎం)ను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులకు చదువుతోపాటు ఆరోగ్యం చాలా అవసరమన్నారు. ఆరోగ్యంగా ఉంటేనే క్రమశిక్షణతో కూడిన విద్య వంట పడుతుందన్నారు. తరచూ ఇటువంటి క్రీడల్లో పాల్గొంటూ మానసిక, శారీరక దృఢత్వాన్ని పెంచుకుని ఆరోగ్యంగా ఉండాలని సూచించారు. ప్రతి విద్యార్థి చదువుతోపాటు తనకు ఆసక్తి కలిగిన ఏదోఒక ఆటలో ప్రావీణ్యం సంపాదించాలన్నారు. అప్పుడే మానసికోల్లాసం తోడవుతుందని చెప్పారు. కార్యక్రమంలో రెస్కో చైర్మన్ వీజీ.ప్రతాప్, కళాశాల ప్రిన్సిపాల్ జి.రామకృష్ణరావు, పీడీలు బి.ప్రవీణ్ కుమార్, ఎస్.శేఖర్, రెడ్డెప్ప, సీహెచ్.రాజేశ్, మాజీ మున్సిపల్ చైర్మన్ డాక్టర్ సుధీర్, కౌన్సిలర్ జిమ్ దాము తదితరులు పాల్గొన్నారు.



స్పోర్ట్స్ మీట్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ కంచర్ల

ప్రతి మహిళా పారిశ్రామికవేత్తగా ఎదగాలి



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు

శాంతిపురం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ప్రతి మహిళా ఒక పారిశ్రామికవేత్తగా ఎదగాలన్నదే ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆశయమని మాజీ ఎమ్మెల్సీ టీడీపీ అధికార ప్రతినిధి గౌనివారి శ్రీనివాసులు, టీడీపీ మండలాధ్యక్షుడు నందిగం ఉదయకుమార్ నాయుడు అన్నారు. బుధవారం మండల సచివాలయంలోని సమావేశ మందిరంలో మండల వెలుగు మహిళా సమైక్య సభ్యులతో షీ లీడ్స్ కార్యక్రమాన్ని కడా ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సంద్భంగా వారు మాట్లాడుతూ డ్వాక్రా సంఘ మహిళలు వ్యాపారాలు చేసుకునేందుకు ప్రభుత్వం ఆర్థికంగా సహాయ సహకారాలు అందిస్తుందన్నారు. కొందరికి ఇప్పటికే రాయితీ రుణాలు మంజూరు చేసినట్లు తెలిపారు. ప్రతి మహిళను లక్షాధికారులను చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నిరంతరం శ్రమిస్తున్నారన్నారు. ప్రస్తుత సమాజంలో మహిళలు అన్నిరంగాల్లో పోటీ పడుతున్నారంటే అందుకు చంద్రబాబునే కారణమన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర లేబర్ వెల్ఫేర్ డైరెక్టర్ విశ్వనాథ నాయుడు, సింగిల్ విండో అధ్యక్షుడు గోపాల్, టీడీపీ మాజీ మండలాధ్యక్షుడు విజయరామిరెడ్డి, రాళ్లబూదుగూరు మాజీ క్లస్టర్ ఇన్‌చార్జి చంద్రశేఖర్, కడా సభ్యురాలు సుగుణమ్మ, రెస్కో డైరెక్టర్ అనుసూయ, ఏఎంసీ సభ్యురాలు శ్యామల, మండల తెలుగు మహిళాధ్యక్షురాలు హేమావతి, ఏపీఎం శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

తల్లిదండ్రులను చూసుకోవాల్సిన బాధ్యత పిల్లలదే



సమావేశంలో మాట్లాడుతున్న న్యాయమూర్తి వంశీకృష్ణ

పుంగనూరు రూరల్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): వృద్ధాప్యంలో తల్లిదండ్రులను చూసుకోవాల్సిన బాధ్యత వారి పిల్లలపైనే ఉంటుందని పుంగనూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కృష్ణవంశీ అన్నారు. బుధవారం రోటరీక్లబ్ ఆధ్వర్యంలో స్థానిక బసవరాజ ప్రభుత్వ బాలుర జూనియర్ కాలేజీలో న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 65 ఏళ్లకు పైబడిన వృద్ధులను వారి పిల్లలే సంరక్షించాల్సి ఉందని, లేని పక్షంలో పిల్లలపై చట్టరీత్యా చర్యలు తీసుకోవడానికి అవకాశం ఉందని వివరించారు. నిరుపేదలు న్యాయం కోసం కోర్టుకు వస్తే వారి కోసం కోర్టు ఉచితంగా న్యాయవాదిని ఏర్పాటు చేస్తుందన్నారు. సమావేశంలో కాలేజీ ప్రిన్సిపాల్ దయానందరాజు, రోటరీక్లబ్ ప్రతినిధులు డాక్టర్ శరణ్‌కుమార్, రాజారెడ్డి, గణేశ్, అనిల్, భాస్కర్, ఎస్ఐ హరిప్రసాద్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

భూగర్భ జలాలు పెంచేందుకే వాటర్‌షెడ్ పనులు



జాలారివంక పనులకు భూమి పూజలో పాల్గొన్న అధికారులు

రొంపిచెర్ల, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): భూగర్భ జలాలు పెంచడానికే వాటర్ షెడ్ పనులు చేపట్టినట్లు పీవో తేజస్విని అన్నారు. రొంపిచెర్ల మండలం బండకిందపల్లెలో పీవో రైతులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పీవో మండలంలోని గానుగచింత, పెద్దగొట్టిగల్లు, బండకిందపల్లె పంచాయతీల్లో రూ.4.30 కోట్ల వ్యయంతో 204 పనులు చేసి జాతికి అంకితం చేశామన్నారు. పెద్ద, చిన్న ఊట కుంటలు, చెక్‌డ్యాంలు, రాతి కట్టడాలకు ప్రాధాన్యత ఇచ్చామని తెలిపారు. అనంతరం రూ.20 లక్షలతో జాలారివంక పనులకు భూమి పూజ చేసి మొక్కలు నాటారు. ఏపీవో బాలమురళీ, ఎంపీడీవో మధుసూదన్‌రెడ్డి, వాటర్‌షెడ్ చైర్మన్లు భాస్కరయ్య, అమరనాథ్‌రెడ్డి, చంద్రయ్య నాయుడు, నాయకులు మదన్‌మోహన్, అమరనాథరెడ్డి, మదన్‌గౌడ, సబ్బీర్‌బాషా, రమణారెడ్డి పాల్గొన్నారు.

కట్టమంచి రామలింగారెడ్డి గొప్ప మేధావి



మాట్లాడుతున్న తులసీనాథం నాయుడు

గంగవరం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ విద్యావేత్త కట్టమంచి రామలింగారెడ్డి కవిగా.. గొప్ప మేధావిగా ఖ్యాతి గడించారని తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి అధ్యక్షులు తులసీనాథం నాయుడు అన్నారు. బుధవారం కట్టమంచి రామలింగారెడ్డి వర్ధంతి సందర్భంగా స్థానిక కళామందిరంలో ఆయన చిత్రపటాన్ని ఏర్పాటు చేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కట్టమంచి రామలింగారెడ్డి పాఠశాల స్థాయి నుంచే రచనలు రూపొందించడం అలవాటు చేసుకున్నారన్నారు. ఆంధ్ర విశ్వవిద్యాలయ మొదటి ఉపకులపతిగా విశేష సేవలందించారని కొనియాడారు. కార్యక్రమంలో సంస్థ కార్యదర్శి పుష్ప, యుగంధర్‌బాబు, ఆనంద్‌బెన్, చంద్రశేఖరయ్య, మాధవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ భవన స్థలంలో ఆక్రమణలు తొలగించాలి



ధర్నా చేస్తున్న దళిత సంఘ నాయకులు

గంగవరం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): గంగవరంలోని అంబేడ్కర్ భవన స్థలంలో ఆక్రమణలు తొలగించి.. ఆక్రమణ దారులపై చర్యలు తీసుకొని న్యాయం చేయాలని దళిత సంఘ నాయకులు బుధవారం గంగవరం తహసీల్దారు కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో ప్రభుత్వం 10 సెంట్ల స్థలాన్ని అంబేడ్కర్ భవనం కోసం కేటాయించారన్నారు. అయితే కొందరు స్థలంపై కన్నేసి ఆక్రమించుకోవడానికి ప్రయత్నిస్తున్నారని, ప్రశ్నిస్తే దౌర్జన్యాలకు పాల్పడుతున్నారని వాపోయారు. అధికారులు స్పందించి ఆక్రమణ దారులపై చర్యలు తీసుకొని న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. దళిత సంఘ నాయకులు డి.వి.మునిరత్నం, రెడ్డెప్ప, ఈశ్వర్, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

మంత్రి అచ్చెన్నాయుడిని కలిసిన ఏఎంసీ చైర్మన్



పుంగనూరు రూరల్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): పుంగనూరు వ్యవసాయ మార్కెట్ యార్డు సమస్యలు పరిష్కరించి అభివృద్ధికి సహకరించాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడిని కలిసి విన్నవించినట్లు ఏఎంసీ చైర్మన్ శమిపతి యాదవ్ తెలిపారు. అమరావతిలోని సచివాలయంలో మంగళవారం రాత్రి మంత్రిని మర్యాదపూర్వకంగా కలిసినట్లు పేర్కొన్నారు.

సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన


సమావేశంలో మాట్లాడుతున్న సీఐ ఉమామహేశ్వరరావు

చిత్తూరు అర్బన్, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాలు, రోడ్డు భద్రతా నియమాలు, మహిళలపై జరిగే నేరాలపై బుధవారం నగరంలోని గిరింపేట మున్సిపల్ హైస్కూల్ విద్యార్థులకు అవగాహన కల్పించారు. మహిళా పోలీసు స్టేషన్ ఎస్ఐ చిన్నరెడ్డప్ప ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశానికి క్రైమ్ సీఐ ఉమా మహేశ్వరరావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలన్నారు. మత్తు వల్ల కుటుంబం కూడా నాశనమైపోతుందన్నారు. యువత సామాజిక మాధ్యమాల పట్ల జాగ్రత్తగా ఉండాలని, తెలియని లింకులు, మెసేజ్‌లను నమ్మకూడదన్నారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మెడికల్ కాలేజీలపై సంతకాల సేకరణ


సంతకాల బండిళ్లను చూపిస్తున్న విజయానందరెడ్డి, నేతలు

చిత్తూరు అర్బన్, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మెడికల్ కాలేజీలను ప్రవేటుపరం చేయడాన్ని వ్యతిరేకిస్తూ వైసీపీ చేపట్టిన కోటి సంతకాల కార్యక్రమం బుధవారంతో ముగిసింది. వైసీపీ చిత్తూరు నియోజకవర్గ ఇన్‌చార్జి విజయానందరెడ్డి ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు కొంగారెడ్డిపల్లె వైసీపీ కార్యాలయం నుంచి మురకంబట్టు జంక్షన్ వరకు ర్యాలీ నిర్వహించారు. వైసీపీ మొదిలియార్ విభాగం రాష్ట్ర అధ్యక్షులు జ్ఞాన జగదీశ్, కేపీ శ్రీధర్, మధురెడ్డి, హరిణిరెడ్డి, నేతలుపాల్గొన్నారు. **గంగాధరనెల్లూరు:** సంతకాల పేపర్లను వైపీపీ నాయకులు బుధవారం గంగాధరనెల్లూరుకు తరలించారు. కార్యక్రమం ముగియడంతో వీరు అంబేడ్కర్, వైఎస్సార్ విగ్రహాలకు పూలమాలలు వేశారు. కార్యక్రమంలో మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి, నియోజకవర్గ వైసీపీ ఇన్‌చార్జి కృపాలక్ష్మి, ఋద్వీరాజ్, వెంకటరెడ్డి, గుణశేఖర్‌రెడ్డి, దయాసాగ్యార్‌రెడ్డి, వెంకటేష్‌రెడ్డి, తదితర నాయకులు పాల్గొన్నారు.

ఎస్టీయూ కార్యవర్గంలో స్థానం


సర్దార్- అమరనాథ్- ఆటుకూరు చంద్రశేఖర్- నాగేంద్రరాజు


రీటా

వెదురుకుప్పం, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): రాష్ట్రోపాధ్యాయ సంఘం(ఎస్టీయూ) జిల్లా కార్యవర్గంలో కార్వేటినగరం మండల నాయకులకు పెద్ద పీట వేశారని ఆ సంఘ రాష్ట్ర నాయకులు అరగొండ హేమచంద్రారెడ్డి, తన్నీరు యువరాజు బుధవారం తెలిపారు. జిల్లా అసోషియేట్ అధ్యక్షుడిగా ఆటుకూరు చంద్రశేఖర్, ఉపాధ్యక్షుడిగా కె.నాగేంద్రరాజు, ఉపాధ్యాయ వాణి కన్వీనర్‌గా ఎస్.సర్దార్, సీపీఎస్ కన్వీనర్‌గా కె.అమరనాథ్, పబ్లిసిటీ కన్వీనర్‌గా పి.వెంకటేశులు, ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా ఎన్ఆర్ సుబ్రహ్మణ్యం, బి.పురుషోత్తం, జిల్లా మహిళా విభాగం కౌన్సిలర్‌గా రీటా ఎన్నికయ్యారని తెలిపారు. వీరి ఎన్నిక పట్ల హర్షం వ్యక్తం చేశారు. వీరి ఎన్నిక పట్ల మండల శాఖ అధ్యక్షులు శివశంకర్, మండల ప్రధానకార్యదర్శి ఎం.సురేష్, ఆర్థిక కార్యదర్శి వై.కార్తికేయులు హర్షం వ్యక్తం చేశారు.

పరీక్షా పే చర్చపై విద్యార్థులకు అవగాహన


కార్వేటినగరంలో అవగాహన కల్పిస్తున్న డైట్ ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ దామోదరరావు

వెదురుకుప్పం, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): పరీక్షా పే చర్చలో భాగంగా ప్రధానితో మాట్లాడే అవకాశానికి రిజిస్ట్రేషన్‌పై డైట్ ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ దామోదరరావు బుధవారం విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఇది పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులతో పధానమంత్రి నరేంద్రమోది నేరుగా మాట్లాడే ప్రతిష్ఠాత్మక కార్యక్రమమన్నారు.ఇందులో పాల్గొనేందుకు విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులను ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. ఈక్రమంలో కార్వేటినగరంలోని ఆర్వేఎస్ఆర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కల్పించారు.హెచ్ఎం కోటేశ్వరరావు, ఉమాశంకర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రేపు ఉచిత వైద్య శిబిరం

చిత్తూరు సిటీ, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): చిన్న పిల్లలకు సబంధించిన గుండె సంబంధిత వ్యాధులకు ఉచిత వైద్యశిభిరం నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గుడిపాల మండలం బొమ్మసముద్రం ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు వైద్యశిభిరం నిర్వహిస్తారన్నారు. బెంగళూరు వైట్ ఫీల్డ్‌లోని వైదేహీ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ ఆధ్వర్యంలో వైద్యపరీక్షలు నిర్వహిస్తారని తెలిపారు. 18 సంవత్సరాల లోపు వయస్సుగల పిల్లలకు గుండె, ఊపిరితిత్తులకు సంబంధించిన సమస్యలుంటే పరీక్షలు నిర్వహిస్తారన్నారు. అవసరమైన వారికి శస్త్ర చికిత్సలు చేస్తారని పేర్కొన్నారు. అవకాశాన్నిసద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్ అందజేత


సుమతికి చెక్కును అందిస్తున్న రాష్ట్ర ప్రభుత్వ విప్ థామస్

వెదురుకుప్పం, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా పేదలకు ఆదుకుంటామని రాష్ట్ర ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే డాక్టర్ వీఎం థామస్ చెప్పారు. ఈ మేరకు బుధవారం రాష్ట్ర ప్రభుత్వ విప్ కార్యాలయం నుంచి ప్రకటన విడుదల చేశారు. తిరుమలయ్యపల్లె పంచాయతీ మొరవ గ్రామానికి చెందిన అత్తూరు సుధాకర్‌రెడ్డి భార్య సుమతికి సీఎం రిలీఫ్ ఫండ్ కింద రూ.92వేల ఆర్థిక సాయాన్ని అందజేశారు.మండల టీడీపీ అధ్యక్షులు పి.మోహన్‌మురళి, ప్రధానకార్యదర్శి శ్రీనాథరెడ్డి తదితరులు హాజరయ్యారు.

మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలి


మాట్లాడుతున్న ఎంపీడీవో శివప్రసాద్‌వర్మ

నింద్ర, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): డ్వాక్రా మహిళలు అన్ని రంగాల్లో ఆర్థికంగా అభివృద్ధి చెందాలని ఎంపీడీవో శివప్రసాద్ వర్మ అన్నారు. బుధవారం స్థానిక వెలుగు కార్యాలయంలో గ్రామ సమైక్య అధ్యక్షులతో విజన్ బిల్డింగ్‌పై నాలుగు రోజుల శిక్షణ కార్యక్రమంలో భాగంగా ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ స్థాయిలో మహిళలు రాబోయే ఐదు సంవత్సరాల్లో అవసరాలను గుర్తించి ప్రణాళికలను తయారు చేసి సక్రమంగా అమలు చేసి అభివృద్ధి చెందాలన్నారు. సమావేశంలో ఇన్‌చార్జి ఏపీఎం లక్ష్మయ్య, డీఎంజీ ఉమాపతి, సీసీలు భాస్కర్, గిరి, మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు హిందూమతి, కార్యదర్శి భవాని, అకౌంటెంట్ లత తదితరులు పాల్గొన్నారు.

జిల్లా ఓబీసీ మోర్చా అధ్యక్షుడికి సన్మానం


కైలాస యాదవ్‌ను సన్మానిస్తున్న పార్టీ నాయకులు


విజయపురం, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): జిల్లా ఓబీసీ మోర్చా అధ్యక్షుడు కైలాస యాదవ్‌ను బుధవారం మండల బీజేపీ నాయకులు కోసలనగరంలో పూలమాల, శాలువాతో సత్కరించారు. మండల అధ్యక్షుడిగా, జిల్లా స్థాయిలో ఉపాధ్యక్షుడిగా చేసిన సేవలను వారు కొనియాడారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు రాము, నాయకులు యుగందర్‌రాజు, పురుషోత్తంరెడ్డి, మునిరెడ్డి, శేఖర్, భాస్కర్‌నాయుడు పాల్గొన్నారు.

గణిత అష్టావధానం అదరహో


పృచ్ఛకుల ప్రశ్నలకు సమాధానమిస్తున్న అరుణ శివప్రసాద్

యాదమరి, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): కె. గొల్లపల్లె పాఠశాలలో బుధవారం గణిత అష్టావధానం నిర్వహించారు. గణిత అష్టావధాని హెచ్.అరుణ శివప్రసాద్ తన 50వ అష్టావధానాన్ని విజయవంతంగా పూర్తిచేశారు. హెచ్ఎం కం ప్రిన్సిపాల్ లలిత ఆధ్వర్యంలో గణిత ఉపాధ్యాయులు కనకాచారి, భారతి, రాకేష్ సహకారంతో కార్యక్రమం జరిగింది. 8 మంది పృచ్ఛకులు వేసిన గణిత ప్రశ్నలకు అరుణ శివప్రసాద్ వెనువెంటనే జవాబులు చెప్పి ఆశ్చర్యపరిచారు. కార్యక్రమానికి ఎంఈవోలు టి.రుక్మిణి,హెచ్ఎల్ఎన్‌ప్రసాద్,ఎస్.రమేష్‌బాబు,ఉపాధ్యాయులు,హాజరయ్యారు. అనంతరం అరుణ శివప్రసాద్‌ను సత్కరించారు.

మత్తు జోలికి వెళ్లవద్దు: జగన్మోహన్


మాట్లాడుతున్న ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్

చిత్తూరు రూరల్, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి):మానవ సంబంధాలను దెబ్బతీసే మత్తు జోలికి యువత వెళ్లొదని ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ సూచించారు. అపోలో యూనివర్సిటీలో బుధవారం మాదకద్రవ్యాలపై జరిగిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ కొందరు మన యువతను దెబ్బతీసే ఉద్దేశంతో డ్రగ్స్‌ను చేర్చేలా కుట్రలు చుష్తున్నారన్నారు. మత్తు ఏ రూపంలో ఉన్నా యువత దూరంగా ఉండాలన్నారు. దేశం గర్వించేలా ముందుకు వెళ్లాలన్నారు. అనంతరంవిద్యార్థులతో ముఖా ముఖి కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో నగర మేయర్ అముద, అపోలో యూనివర్సిటీ డీన్ ఆల్ఫ్రెడ్ అగస్టీన్, యూనిట్ హెడ్ బాలరాజ్, సీఐలు నిత్యాబాబు, మహేశ్వర్, నెట్టికంతయ్య తదితరులు పాల్గొన్నారు.

పన్ను వసూళ్లలో జాప్యమేల?


తిరువీధికుప్పం గ్రామ పంచాయతీ కార్యాలయం

గంగాధరనెల్లూరు, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): సాధారణంగా పల్లెల అభివృద్ధికి పంచాయతీ ఆదాయమే ఆధారం. తర్వాత ఆర్థిక సంఘం నిధులు తోడ్పడతాయి. పంచాయతీ ఆధార వనరులో సింహభాగం ఇంటి పన్నులే. అలాంటిది కొద్దికాలంగా గ్రామాల్లో ఇంటిపన్నులు వసూళ్ల విషయంలో పంచాయతీ కార్యదర్శులు తాత్సారం చేస్తున్నారు. దీంతో ఆ పన్ను బకాయిలు పేరుకు పోతున్నాయి. మండలంలో ముక్కళత్తూరు పంచాయతీలో 64.48 శాతం వసూలు చేసి మొదటిస్థానంలో ఉంది. 1.14 శాతం మాత్రమే వసూలుతో నెల్లేపల్లె పంచాయతీ చివరి స్థానంలో నిలిచింది. మండలంలో 32 పంచాయతీలున్నాయి. మొత్తం ఇంటిపన్ను డిమాండ్ రూ.90,94,453గా నిర్దేశించారు. ఇందులో ఇప్పటివరకు రూ.12,27,630 మాత్రమే వసూలు చేసినట్లు అధికారులు తెలిపారు. ముక్కళత్తూరు పంచాయతీలో ఇంటిపన్ను రూ.1,99,473కు గాను రూ.1,28,621 వసూలు చేశారు. ఎల్లాపలెలో రూ.26,584, పాచిగుంట రూ. 98,336, బంగారెడ్డిపల్లెలో రూ. 51,353 వసూలైంది. ఇటీవల పంచాయతీ కార్యదర్శులు ఇంటిపన్నుల వసూలుపై అంతగా దృష్టిసారించడంలేదనే విమర్శ ఉంది. బెయిల్ సర్టిఫికేట్‌కోసం వచ్చిన వారి నుంచి మాత్రమే పంచాయతీ కార్యదర్శి ఇంటిపన్ను కట్టించుకుంటున్నారు. పిల్లల చదువుల కోసం బ్యాంక్ రుణాలకు వెళ్లిన సందర్భంలోనూ ఇళ్ల పన్ను చెల్లిస్తున్నారు. మండలంలో రూ.78.66లక్షల మేరకు పన్ను బకాయిలు పేరుకుపోయింది. ఇంటిపన్నుల ఆదాయంతో గ్రామాల్లో కొంత మేర సమస్యలకు పరిష్కారం ఉంటుందని సర్పంచులు చెబుతున్నారు.

పన్ను చెల్లించి ప్రగతికి సహకరించండి



మా పంచాయతీలోని ఇంటిపన్ను కట్టడానికి ప్రజలు అంతగా మొగ్గుచూపడంలేదు. పంచాయతీ కార్యదర్శులు కొన్నాళ్ళ క్రితమే ఇంటి పన్ను డిమాండ్ నోటీసులు జారీచేశారు. పన్ను పూర్తి స్థాయిలో వసూలైతేగాని గ్రామాల్లో సమస్యలను పరిష్కరించడానికి వీలుపడటంలేదు. ప్రతి ఒక్కరూ తమవంతు బాధ్యతగా పంచాయతీకి ఇంటిపన్ను చెల్లించి గ్రామ పురోభివృద్ధికి సహకరించాలి

-చీనీ సుబ్రమణ్యం, గంగాధరనెల్లూరుసర్పంచ్

స్పందన తక్కువగానే ఉంది



ఇంటిపన్నుడిమాండ్ నోటీసులు జారీచేశాం స్పందన తక్కువగా ఉంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి రూ.82లక్షలు ఇంటిపన్ను బకాయి రావాల్సి ఉంది. గతంలో డిమాండ్ నోటీసులను అక్టోబరు, నవంబరులలో ఇచ్చేవాళ్ళం. అప్పుడు మాన్యువల్ రూపంలో వసూలు చేసేవారు. ఇప్పుడు ఆన్‌లైన్ ద్వారానే చెల్లించాలి. చాలా మంది యజమానుల నుంచి కొత్త పద్ధతిలో వసూలు చేయడం కొంత ఇబ్బందిగా ఉంది. వారు ఈ సౌకర్యం లేదంటూ సాగదీస్తున్నారు.

- శివయ్య,ఇన్‌చార్జి డిప్యూటీ ఎంపీడీవో

ఘనంగా సీఆర్‌రెడ్డి జయంతి వేడుక


కట్టమంచి విగ్రహం వద్ద నివాళులు అర్పిస్తున్న సాహితీ వేత్తలు, రచయితలు

చిత్తూరు కలెక్టరేట్, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): సాహితీ వేత్త, బహుముఖ ప్రజ్ఞాశాలి, రచయిత కట్టమంచి రామలింగారెడ్డి జయంతి వేడుక బుధవారం చిత్తూరు నగరంలో జరిగింది. తొలుత పాత న్యూట్రిన్ ఫ్యాక్టరీ లోని ఆయన సమాధి వద్ద పలువురు పాల్గొని పూజలు చేసి నివాళులు అర్పించారు. అనంతరం కలెక్టర్ బంగ్లా వద్ద సీఆర్‌రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేశారు. కార్యక్రమలో జిల్లా రచయితల సంఘం గౌరవాధ్యక్షుల బాలకృష్ణారెడ్డి, రచయితలు, రచయిత్రులు సహదేవనాయుడు, అరుణకుమారి, కట్టమంచి మాలతి, గోవర్ధన్‌బాబి, శ్రీధర్‌రెడ్డి, శ్రీనివాసమూర్తిలతోపాటు సీఆర్‌రెడ్డి పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.

డాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని వినతి


హనుమంతప్పకు వినతిపత్రం అందిస్తున్న యూనియన్ నాయకులు

ఐరాల, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వాసుపత్రిలో సిబ్బందిని మానసికంగా వేధించిన డాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని విచారణ అధికారి హనుమంతప్పను ఏపీ ఎన్జీవోస్ యూనియన్ నాయకులు బుధవారం కోరారు. 15 రోజుల క్రితం ఐరాల డాక్టర్ రెడ్డెప్ప తమను మానసికంగా వేధిస్తున్నారని సిబ్బంది నిరసన వ్యక్తం చేసిన సంగతి విదితమే. ఈ ఆరోపణలపై విచారించేందుకు జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి హనుమంతప్ప వచ్చారు. సిబ్బందితో ఆయన మాట్లాడారు. అనంతరం యూనియన్ నాయకులు భానుప్రకాష్, చంద్రశేఖర్,శ్రీనివాస మూర్తిలు విచారణ అధికారితో మాట్లాడుతూ వైద్యాధికారిగా ఉంటూ బయట వ్యక్తి చేత సిబ్బందికి డ్యూటీలు వేయిస్తున్నట్లు ఆరోపించారు. ఆశా వర్కర్లు రాత్రి సమయంలో డ్యూటీలో ఉండాలని హుకుం జారీ చేస్తున్నట్లు వివరించారు. ఏపీ పబ్లిక్ హెల్త్ అండ్ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, ఏపీ ఎన్జీవోస్ అసోసియేషన్ జిల్లా జాయింట్ కార్యదర్శి మహేష్ తదితరులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు బానిస కావద్దు


సమావేశంలో మాట్లాడుతున్న ఎస్ఐ నరసింహులు


ఐరాల(కాణిపాకం), డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): యువత మత్తు పదార్థాలకు బానిస కావద్దని ఎస్ఐ నరసింహులు హితవు పలికారు. బుధవారం ఎం.పైపల్లె జడ్పీ హైస్కూల్‌లో ఆయన మాదక ద్రవ్యాల వినియోగంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్నతనంలో మత్తుకు బానిసలైతే బంగారు భవిష్యత్తు నాశనం అవుతుందన్నారు. విద్యార్థులు ఈ వయసులో చదువుపై దృష్టి పెట్టాలన్నారు. పాఠశాలలకు వంద మీటర్ల దూరంలో ఎవరైన మత్తు పదార్థాలను విక్రయిస్తున్నటు ఉంటే తమకు సమాచారం అందించాలన్నారు. విద్యార్థులు సెల్ ఫోన్లను వినియోగించక పోతే చాలా మంచిదన్నారు. సమావేశంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జిల్లా సహకార అధికారి తనిఖీలు


మందుల షాపును పరిశీలిస్తున్న డీసీవో లక్ష్మి

నగరి, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాన్ని(పీఏసీఎస్) జిల్లా సహకార అధికారి లక్ష్మి బుధవారం తనిఖీ చేశారు. కార్యాలయ రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం జనరల్ మెడిసిన్ షాపును తనిఖీ చేశారు. అమ్మకాల గురించి అడిగి తెలుసుకున్నారు. బీపీ, షుగర్, దగ్గు, జ్వరం వంటి వాటి వ్యాధులకు సిరప్‌లు అందుబాటులో ఉన్నాయో లేదో ఆరా తీశారు. అనంతరం ఎరువుల గోడౌన్ కల్యాణ మండపాలను తనిఖీ చేశారు. పీఏసీఎస్ ఆధ్వర్యంలో జరిగే షాపింగ్ కాంప్లెక్స్ తదితర అంశాల గురించి అడిగి తెలుసుకున్నారు. కల్యాణ మండపం అంశంపై తనకు నివేదిక పంపినట్లయితే తదుపరి పనులు పూర్తయేలా చర్యలు తీసుకుంటామన్నారు. పీఏసీఎస్ అధ్యక్షుడు బాలాజీ, డైరెక్టర్ జవహర్‌రెడ్డి, సీఈవో తులసిపిళ్లై, మాజీ పీఏసీఎస్ అధ్యక్షులు కుమార్ నాయుడు, శేఖర్, గుణశేఖర్, కార్తీక్ పాల్గొన్నారు.

లోక కల్యాణానికి వేద పఠనం


రాధా మనోహర్ దాస్

చిత్తూరు కల్చరల్, డిసెంబరు10(ఆంధ్రజ్యోతి): లోకోద్ధరణ ఆపేక్షతో లోక సంచారం చేసిన ఆది శంకరాచార్యులు, ఎన్నో ఆధ్యాత్మిక, తర్క, వితర్క, ఇతిహస పురాణాలు, వేదాలు పఠించారని ప్రముఖ ఆధ్యాత్మిక ప్రవచన కర్త రాధామనోహర్ దాస్ అన్నారు. స్థానిక నగర పాలక నాగయ్య కళాక్షేత్రంలో బుధవారం భజగోవిందం కార్యక్రమంలో భాగంగా మూడవరోజు ఆయన ప్రవచించారు.భజగోవింద పారాయణం భక్తుల్లో నిగూఢంగా దాగిన ఆత్మనిర్భరత, స్థైర్యానికి ప్రతీక అన్నారు. ఈ ప్రవచన కార్యక్రమం గురువారం కూడా కొనసాగుతుందని నిర్వాహకులు తెలియజేశారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

లెప్రసీ ఆశ్రమంలో దుప్పట్ల పంపిణీ



చిత్తూరు రూరల్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): నగరంలోని ఇరువారం వద్ద లెప్రసీ ఆశ్రమంలో బుధవారం నగరానికి చెందిన మాజీ కౌన్సలర్ పార్థసారథినాయుడు దుప్పట్లు పంపిణీ చేశారు. ఇక్కడ రోగులు చలికి ఇబ్బందులు పడుతున్నారని తెలుసుకొని దుప్పట్లు పంపిణీ చేసినట్లు ఆయన తెలిపారు. ఆశ్రమ నిర్వాహకులు, రోగులు పార్థసారథినాయుడికి కృతజ్ఞతలు తెలిపారు. తాలుకా పోలీస్ స్టేషన్‌కు 10 కుర్చీలను సీఐ నిత్యాబాబుకు అందజేశారు.

బంగారమ్మ జాతరకు చాటింపు


బంగారమ్మ జాతర చాటింపులో విచిత్ర వేషధారణ

వెదురుకుప్పం, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): కార్వేటినగరం గ్రామ దేవత బంగారమ్మ జాతరకు బుధవారం చాటింపు చేశారు. ఈ నెల 16,17 తేదీల్లో జాతర నిర్వహిస్తున్నామని ఆలయ కమిటీ అధ్యక్షులుప్రసాద్ తెలిపారు. ఈ క్రమంలో వేషదారణలు పలువురిని ఆకట్టుకున్నాయి

ప్రహరీ నిర్మాణానికి నిధుల మంజూరు

విజయపురం, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): ఇళ్ళత్తూరు ప్రాథమికోన్నత పాఠశాలకు మహాత్మగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం అనుసంధానంతో నిర్మించడానికి రూ.10 లక్షలు మంజూరు చేస్తూ జిల్లా కలెక్టరు ఉత్తర్వులు జారీ చేశారు. ప్రహరీ నిర్మాణానికి నిధులు మంజూరుకు కృషి చేసిన ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్‌కు టీడీపీ సీనియర్ నాయకులు మునిభాస్కర్‌రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

రేపు అర్చకుల సమావేశం

చిత్తూరు కల్చరల్, డిసెంబరు10(ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా 99 ఆలయాలకు ధూపదీప నైవేద్య పథకం రాని 99 మంది ఆలయాల అర్చకులు తమ వివరాలను శుక్రవారం సాయంత్రం లోపల జిల్లా అర్చక సమాఖ్య అధ్యక్షునికి తమ వివరాలు అందజేయాల్సి ఉంటుంది. ఈమేరకు జిల్లా అర్చక సమాఖ్య అధ్యక్షుడు వేణుగోపాల్ బుధవారం ఒక ప్రకటనలో కోరారు. ఇతర వివరాలకు జిల్లా అర్చక సమాఖ్య అధ్యక్షులు వేణుగోపాల్, మొబైల్ ఫోన్ నంబరు 8125887381ను సంప్రదించాలని ఆయన కోరారు.

డ్రైనేజి పనుల ప్రారంభం


వీరకనెల్లూరులో డ్రైనేజి పనుల్లో భాగంగా ఎక్స్‌కవేటర్‌తో గాడితీస్తున్న దృశ్యం

గంగాధరనెలూరు, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): పీఎం జీఎవై పథకం ద్వారా వీరకనెల్లూరు దళితవాడలో డ్రైనేజి నిర్మాణ పనులను బుధవారం ప్రారంభించారు. ఈక్రమంలో ఎక్స్‌కవేటర్‌తో గాడి తవ్వకాలకు శ్రీకారం చుట్టారు. ఎమ్మెల్యే డాక్టర్ థామస్ సహకారంతో మంజూరైన నిధులతో డ్రైనేజి నిర్మాణ పనులను స్థానిక టీడీపీ నేతలు లాంఛనంగా మొదలు పెట్టారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సురేఖ పాల్గొన్నారు. నిధులు మంజూరు చేసి పనులను ప్రారంభించడంపై స్థానికులు హర్షం వ్యక్తం చేశారు

ఇంటర్ స్పోర్ట్స్ మీట్ ప్రారంభం


స్పోర్ట్స్ మీట్‌ను ప్రారంభిస్తున్న కంచర్ల

కుప్పం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): శారీరక మానసిక ఆరోగ్యానికి ఆటలు ఉత్తమమైన మార్గమని ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, ఏపీఎస్ఆర్టీసీ వైస్ చైర్మన్ పీఎస్.మునిరత్నం పీకేఎం ఉడా చైర్మన్ డాక్టర్ బీఆర్.సురేశ్‌బాబు అన్నారు. కుప్పంలోని డాక్టర్ వైసీ జేమ్స్ యెన్ ప్రభుత్వ పాలిటెక్నిక్‌లో బుధవారం ఇంటర్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్ (ఏపీఎస్‌జీఎం)ను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులకు చదువుతోపాటు ఆరోగ్యం చాలా అవసరమన్నారు. ఆరోగ్యంగా ఉంటేనే క్రమశిక్షణతో కూడిన విద్య వంట పడుతుందన్నారు. తరచూ ఇటువంటి క్రీడల్లో పాల్గొంటూ మానసిక, శారీరక దృఢత్వాన్ని పెంచుకుని ఆరోగ్యంగా ఉండాలని సూ చించారు. కార్యక్రమంలో రెస్కో చైర్మన్ వీజీ.ప్రతాప్, కళాశాల ప్రిన్సిపాల్ జి.రామకృష్ణరావు, పీడీలు బి.ప్రవీణ్ కుమార్, ఎస్.శేఖర్, రెడ్డెప్ప, సీహెచ్.రాజేశ్, మాజీ మున్సిపల్ చైర్మన్ డాక్టర్ సుధీర్, కౌన్సిలర్ జిమ్ దాము తదితరులు పాల్గొన్నారు.